జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 3 సంచిక - 9 పక్షపత్రిక మే 1-15, 2012




ఏప్రిల్ 24 జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

## స్థానిక ప్రభుత్వాలు....

మంచి రాజకీయాలు



తిరుపతిలో అంత్యోదయ రేషన్ కార్డుల్లో అక్రమాలపై
ఆర్‌డిఓకు వివరిస్తున్న లోక్‌సత్తా పార్టీ నాయకులు



జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక మే 1-15, 2012

సంపుటి - 3 సంచిక - 9

## లోపలి పేజీల్లో...

స్థానిక ప్రభుత్వాలు - రాజ్యాంగస్ఫూర్తి...... 5

సరైన వారికి ఓటు వేయడానికి మనకు ఇంకెన్ని గుణపాఠాలు కావాలి................. 10

రాష్ట్రాల గోడు పట్టదా ........................... 13

ఆనాటి స్ఫూర్తి ఏదీ................................ 16

లాభసాటి వ్యవసాయానికి అనుకూల విధానాలు తెస్తారా ...... ..................... 20

610 జీవో అమలు చేయాల్సిందే......... 22

బినామీల సునామీ ............................ 23

సామాజిక అంతరాలకు కారణం............ 26

అవినీతి గురించి అందరూ నిజమే చెబుతున్నారు.................................... 28

ఆధునిక భావజాలం............................. 30

సంక్షోభంలో వ్యవసాయరంగం............. 32

జిల్లాల సమాచారం............................. 33

## సంపాదకవర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**
సంపాదకులు

**సంపాదక వర్గం**

జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫొటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# ఎన్నికల్లో ప్రజలే గెలవాలి

## సంపాదకీయం

రాష్ట్రంలో ఉప ఎన్నికల నగారా మోగింది. కాని అధికార ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, తెలుగుదేశంతో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కూడా సంక్షోభంలో కూరుకుపోయాయి. ఎన్నికల విషయంలో ఎవరి భయం వారిది. కాని అందరి టార్గెట్ ఒక్కటే 18 అసెంబ్లీ స్థానాల్లో తామే గెలవాలని కోరుకుంటున్నారు. ఈ మూడు పార్టీలకి ప్రజల కరుణాకటాక్షాలే కావాలి. ఖాళీ అయిన 18 స్థానాలు కాంగ్రెస్ పార్టీవే. అన్నీ గెలవకున్నా, ఎన్ని ఎక్కువ దక్కించుకుంటే అంత మంచిది. లేకపోతే కిరణ్‌కుమార్ రెడ్డికి పదవీగండమే అంటున్నారు. 2009 ఎన్నికల తరువాత వచ్చిన ప్రతి ఉప ఎన్నికల్లో ఓటమి పాలౌతున్న టీడీపికి ఇది జీవన్మరణ సమస్య. ప్రధాన ప్రతిపక్షం కాస్తా 2009 ఎన్నికల నాటి నుండి నానాటికి 'తీసికట్టు నాగం బొట్టు'లాగా తయారైంది. ఇక జగన్ సంగతి సరే సరి. 'పోరాడితే పోయేదేమి లేదు బానిస సంకెళ్ళు' తప్ప అన్న విధంగా జీరో నుంచి మొదలుపెట్టి ఎన్ని గెలిస్తే అన్నీ తన ఖాతాలోనే. కాని ఆయన భయం ఆయనది. గెలవకపోతే ఈ పార్టీలు పాతాళానికి తొక్కేస్తాయి.

ఉప ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఇటు కిరణ్, అటు చంద్రబాబు మరో వంక జగన్ రాష్ట్రమంతా చుట్టి వస్తున్నారు. ఈలోపు మద్యం సిండికేట్ల కుంభకోణం, ఏసీబీ దాడులు, పోటాపోటీ ధర్నాలు రాష్ట్ర రాజకీయం బహూ రంజుగా వుంది. సందట్లో సడేమియాలాగా రాష్ట్రంలో క్రికెట్ బెట్టింగ్, కోడిపందాల్లాగా ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడతారు అని ఉబుసుపోకరాయుళ్లు పందాలు కాస్తున్నారు.

రాష్ట్ర చరిత్రలో గత మూడేళ్ళలో వచ్చినన్ని ఉప ఎన్నికలు ఎప్పుడూ రాలేదు. కాని ప్రజల సమస్యలు మాత్రం ఈ ఎన్నికల ప్రచారంలో ప్రధాన అంశం కావడం లేదు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజల ఎజండా మరచిన ఈ పార్టీలు తమ వ్యక్తిగత, పార్టీ ప్రయోజనాల కోసం ప్రజల ప్రయోజనాలను పణంగా పెడుతున్నాయి. ఓటు బ్యాంకు రాజకీయాల్లో ఈ మూడు పార్టీలు నిలువెల్లా కూరుకుపోయాయి. అన్ని పార్టీలు చెప్పే విషయాలను వింటున్న ప్రజలు నిజమైన రాజకీయం కోసం ఓటు వేద్దామని మనసులో వున్నా ఆ పార్టీ గెలుస్తుందో లేదో లేక మనం వేసే ఓటు ఎదుటి పార్టీని గెలిపిస్తుందా... ఓడిస్తుందా... అన్న మీమాంస వల్ల ఓటర్లు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. అందుకే ప్రతి ఎన్నికల్లో పార్టీలు గెలుస్తూ ప్రజలు ఓడిపోతున్నారు. ఈ దశలో ప్రజలకి ప్రత్యామ్నాయ పార్టీలు, రాజకీయాలు అవసరం. నిజమైన రాజకీయాన్ని ఆదరించిననాడు ప్రజలే గెలుస్తారు. ◆

**ఇది కార్పెంటరీ క్లాస్ కాదయ్యా బాబూ.......**
**ఎన్నికల ముందు సీట్లు పంచుకోవడానికే ఈ పాట్లు పడుతున్నారు**



# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
8-2-674బి/2/9, ప్లాట్ నం : 93
హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,
బంజారాహిల్స్, హైదరాబాద్ – 500 034

**ఫోన్ నంబర్లు :**
**040-23311817, 23311819,**
**23311820, 23312829**
**ఫ్యాక్స్ : 040-23310612**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**
సెల్ : *80085 07934*

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

ఏప్రిల్ 24 జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక వ్యాసం....

# స్థానిక ప్రభుత్వాలు - రాజ్యాంగ స్ఫూర్తి

- బండారు రామ్మోహన్ రావు

*1993, ఏప్రిల్ 24 దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ముఖ్యమైన రోజు. గ్రామ స్వరాజ్యం కాంక్షించిన పూజ్య బాపూజీ కలలు కాగితంమీద నిజమైన రోజు. 1992లో అప్పటి ప్రధాని పి.వి. నరసింహరావు ప్రవేశపెట్టిన 73, 74వ రాజ్యాంగ సవరణలు ఆమోదించబడి చట్టంగా రూపొందిన రోజు. రాజ్యాంగం ప్రకారం జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాగో స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగంలో నిజమైన స్థానం లభించిన రోజు. పంచాయతీ, మధ్యంతర, జిల్లా ప్రభుత్వాలుగా మూడంచెల విధానం దేశావ్యాప్తంగా ప్రవేశపెట్టిన రోజు. పంచాయతీలకు 29 అధికారాలు, మున్సిపాలిటీలకు 18 అధికారాలు దఖలు పరచిన రోజు. గ్రామసీమలకి నిజమైన రాజ్యాధికారం రాజ్యాంగపరంగా లభించిన రోజు. దేశవ్యాప్తంగా రాజకీయ సమీకరణల్లో మార్పు వచ్చిన రోజు. అందుకే ఏప్రిల్ 24 జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా ప్రత్యేక వ్యాసం......*

**భారత ప్రధాని మన్మోహన్‌సింగ్, జాతీయ సలహామండలి అధ్యక్షురాలు శ్రీమతి సోనియాగాంధీ ప్రత్యక్ష సాక్షులుగా 2011లో జరిగిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో జాతీయప్రభుత్వం ఒక రోడ్‌మ్యాప్‌ను ప్రకటించింది. గ్రామ సభలకి పెద్దపీట వేస్తూ నిర్ణయాధికారాన్ని గ్రామసభలకు ధారాదత్తం చేసిన రాజ్యాంగ విలువలకి స్ఫూర్తినిస్తూ గ్రామ సభ సంవత్సరంగా 2011-12 ప్రకటించింది. 2016వరకు ఈ రోడ్‌మ్యాప్‌ను కొనసాగించాలని నిర్ణయించింది. కాని వాస్తవానికి అన్నీ వున్నా అల్లుడినోట్లో శనిలాగా పంచాయతీరాజ్ వ్యవస్థకి ఎన్నికలు జరపకుండా గత 20 నెలలుగా మన రాష్ట్రప్రభుత్వం వాయిదా వేస్తుంది.**

మన భారత రాజ్యాంగంలో గ్రామపంచాయితీలు, మండలపరిషత్‌లు, జిల్లాపరిషత్‌లను "స్థానిక ప్రభుత్వాలు"గా గుర్తించాము. కానీ అచరణలో వాటిని స్థానిక సంస్థలుగా పరిగణిస్తున్నారు. సకాలంలో ఎన్నికలు జరపకపోవడం మొదలుకొని నిధులు, విధులు, అధికారాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. 73వ రాజ్యాంగ సవరణ తర్వాత ఈ పరిస్థితిలో మార్పు వస్తుందని ఆశించినా **"గత కాలమే మేలు వచ్చు కాలము కంటెన్"** అన్నట్లు స్థానిక ప్రభుత్వాలు మరింత నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. అధికార వికేంద్రీకరణ చేయాల్సిన రాష్ట్రప్రభుత్వం అధికారాన్ని తన గుప్పెట్లో పెట్టుకొని **"ఎమ్మెల్యేల రాజ్యం"** తీసుకువచ్చి పూర్తి అధికార కేంద్రీకరణకు దారులు వేసింది.

మన రాష్ట్రంలో పంచాయితీలు మొదలుకొని మున్సిపాలిటీలు, మండల, జిల్లాపరిషత్‌ల పాలక వర్గాల పదవికాలం ముగిసిపోయినా ఎన్నికలు జరపకుండా సంవత్సరాల తరబడి జాప్యం చేస్తూ రాష్ట్రప్రభుత్వం రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కింది. ఈవేళ మన రాష్ట్రంలో స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికైన ప్రజాప్రతినిధుల బదులు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు, పర్సన్ ఇన్‌చార్జిలు పరిపాలిస్తున్నారు. స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయడం అటుంచి వాటిని నిర్వీర్యం చేసింది. ఈ దుస్థితికి కారణం రాష్ట్ర ప్రభుత్వమే. రాష్ట్ర ప్రభుత్వానికే గనుక అవకాశం ఉంటే ఎమ్మెల్యే, ఎం.పి. ఎన్నికలను కూడా వాయిదా వేసేది. అదృష్టవశాత్తు ఆ అవకాశం మన రాజ్యాంగం వారికి ఇవ్వలేదు.

**స్థానిక ప్రభుత్వాల చరిత్ర :** 1950 జనవరి 26 నుండి అమలైన రాజ్యాంగంలో "లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్" (స్థానిక స్వపరిపాలన) అని అదేశిక సూత్రాలలో రాసుకున్నాం. దేశంలో పరిపాలనకు జాతీయ ప్రభుత్వానికి కొన్ని అధికారాలు

రాష్ట్రప్రభుత్వాలకి కొన్ని అధికారాలు ఇస్తూ ఉమ్మడిగా జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాలకు బాధ్యత ఉండేలా ఉమ్మడి జాబితాలో మరికొన్ని అధికారాలను రాజ్యాంగంలో కేటాయించారు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో స్థానిక ప్రభుత్వాల గురించి పెద్దగా ఆలోచించలేదు. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం అంశాన్ని ఆదేశిక సూత్రాలలో రాసి సరిపెట్టారు. కానీ ఆ తర్వాత పాలనలో వచ్చిన అవసరాలను బట్టి 1952లో సమాజ అభివృద్ధి కేంద్రాలుగా (కమ్యూనిటి డవలెప్‌మెంట్ ప్రాజెక్టు) ప్రయోగాత్మకంగా దేశంలో ఏర్పాటు చేశారు. బల్వంతరాయ్ మెహత కమిషన్ సూచనల మేరకు 1959లో దేశవ్యాప్తంగా పంచాయితీ రాజ్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. మన రాష్ట్రంలో 1964లో పంచాయితీ రాజ్ చట్టం వచ్చింది. అలా గ్రామపంచాయితీ పంచాయితీ సమితి, జిల్లాపరిషత్‌లుగా ఏర్పాటు చేశారు. 1987లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు ఆలోచనల ప్రకారం మాండలిక వ్యవస్థ అమలులోకి వచ్చింది. దాంతో పంచాయితీరాజ్ వ్యవస్థలలో మధ్యంతర వ్యవస్థ "సమితి" నుండి మండలానికి మారింది. 35వేల జనాభా ఉన్న ప్రాంతాన్ని ఒక మండలంగా ఏర్పాటు చేశారు. దాంతో స్థానిక పాలన ప్రజలకు చేరువైంది.

1989 లో జవహర్ రోజ్‌గారి యోజన (JRY) పథకం ద్వారా గ్రామ పంచాయతీలకు తలసరి 35 రూపాయల వరకు గ్రాంటుగా ఇచ్చి పంచాయతీలకు సరాసరి డబ్బు చేరేలా చేసి అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేశారు. ఆయన మరణించాక పి.వి. నరసింహారావు ప్రధాన మంత్రిగా రాజీవ్‌గాంధీ ఆశయాలను కొనసాగించారు. 1993లో రాజ్యాంగంలో 73,74వ రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయితీలకు 29 అంశాలు, మున్సిపాలిటీలకు 18 అంశాలు కేటాయించారు. జాతీయ స్థాయిలో జాతీయ ప్రభుత్వం, రాష్ట్రాలలో రాష్ట్రప్రభుత్వం, జిల్లాలలో జిల్లా ప్రభుత్వాలుగా ఇవి పనిచేస్తాయని ఆశించారు. ఈ రాజ్యాంగ సవరణలు మన రాష్ట్రంలో 1994 నుండి అమలులోకి వచ్చాయి. కొత్త చట్టం ప్రకారం మన రాష్ట్రంలో 1995, 2001, 2006లో ఎన్నికలు జరిగాయి. రాజ్యాగం ప్రకారం ప్రతి ఐదు సంవత్సరాలకు తప్పక ఎన్నికలు జరపాలని ఉన్నా వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు ఎన్నికలు వాయిదా వేస్తున్నాయి. సకాలంలో ఎన్నికలు జరపడానికి పూనుకోకుండా ఏవో సాంకేతిక కారణాలు చూపి రాజకీయంగా ఎన్నికలు వాయిదా వేస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నాయి. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఇప్పటికీ ఇదే తంతు కొనసాగుతుంది. ఎన్నికలు జరపాలని ప్రతిసారి కోర్టులకెళ్ళి ఆదేశాలు తెచ్చుకుంటే తప్ప రాష్ట్రప్రభుత్వం ఎన్నికలు జరపని సంగతి మనం గమనించవచ్చును.



### పంచాయితీరాజ్‌లో అంచెలు ఎన్ని:

పంచాయితీరాజ్ వ్యవస్థలో ఎన్ని అంచెలు ఉన్నాయి అంటే ఆ శాఖ మంత్రితో సహా ప్రభుత్వంలో ఉన్న వారుకూడా సరైన సమాధానం చెప్పడం లేదు. కొందరు ఐదు అంచెలు ఉన్నాయని చెబుతున్నారు.

అలాగే స్థానిక ప్రభుత్వాలుగా పిలవాల్సిన వాటిని స్థానిక సంస్థలుగా పిలుస్తూ వాటిని నిర్వీర్యం చేసి మాట్లాడుతున్నారు. వాస్తవం ఏమిటంటే మన రాజ్యాంగం ప్రకారం పంచాయితీరాజ్ వ్యవస్థలోని అన్ని అంచెలను స్థానిక ప్రభుత్వాలుగా పరిగణించాలి. అలాగే అంచెల విషయానికి వస్తే గ్రామ పంచాయితీలో వార్డు మెంబరు, సర్పంచ్ అనే రెండు పదవులతో ఒక అంచె ఉంది. మండల పరిషత్‌లో ఎమ్.పి.టి.సి., సభ్యులు, ఎమ్.పి.పి. అధ్యక్షులు కలిపి మధ్యంతర అంచె ఉంది. అలాగే జిల్లా స్థాయిలో జడ్.పి.టి.సి, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఇలా జిల్లా అంచెతో కలిపి మూడంచెల వ్యవస్థ ఉంది. ◆



## 73వ రాజ్యాంగ సవరణ ప్రస్తావించిన ముఖ్యమైన అంశాలు

- ★ దేశవ్యాప్తంగా పంచాయితీ, మధ్యంతర వ్యవస్థ (మండలం లేదా బ్లాక్) జిల్లాపరిషత్ మూడంచెల వ్యవస్థ ఉండాలి.
- ★ పంచాయితీరాజ్ వ్యవస్థలోని మూడంచెలకి ఐదేళ్ళకు ఒకసారి తప్పక ఎన్నికలు జరపాలి.
- ★ ఎన్నికలు జరపడానికి రాష్ట్రస్థాయిలో స్వతంత్ర ఎన్నికల కమిషన్‌ను నియమించాలి.
- ★ పంచాయితీలను ఆర్థిక పరిపుష్టం చేయడానికి రాష్ట్రస్థాయిలో స్వతంత్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చెయ్యాలి.
- ★ దేశంలో పంచాయితీరాజ్ అన్ని అంచెలలో పదవులలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కేటాయించారు.
- ★ దేశంలో పార్లమెంటుకు అధికారం ఎలా ఉందో, గ్రామస్థాయిలో "గ్రామసభ" గ్రామపార్లమెంటుగా వ్యవహరించాలి.
- ★ ప్రతి ఆరునెలల లోపల ఒకసారి "గ్రామసభ" సమావేశం అవ్వాలి.నిర్ణయాలలో ప్రజల భాగస్వామ్యం పెంచాలి.
- ★ పంచాయితీరాజ్ వ్యవస్థకు నిధులు, విధులు అధికారాలు ఇవ్వాలి.
- ★ రాజ్యాంగంలో పేర్కొన్న 29 అంశాలను వెంటనే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పంచాయితీలకు బదలాయించాలి.

# స్థానిక ప్రభుత్వాలు - అధికార వికేంద్రీకరణ

## అధికార వికేంద్రీకరణ తప్పుడు నమూనా

కేంద్ర ప్రభుత్వం
↓
రాష్ట్ర ప్రభుత్వం
↓
జిల్లా పరిషత్ / పంచాయితీ రాజ్ వ్యవస్థ
↓
మండల పరిషత్
↓
గ్రామ పంచాయతీ

నగర పాలక సంస్థలు
మెట్రో నగరాలు
మున్సిపల్ కార్పొరేషన్‌లు
మున్సిపాలిటీలు /
నగర పంచాయితీలు

| పంచాయితీరాజ్ వ్యవస్థలో ఎన్ని అంచెలు ఉన్నాయి |
|---|
| గ్రామపంచాయితీ<br>పంచాయితీ సభ్యులు - సర్పంచ్ |
| మండల పరిషత్<br>ఎమ్.పి.టి.సి - ఎమ్.పి.పి.అధ్యక్షులు |
| జిల్లా పరిషత్<br>జడ్.పి.టి.సి - జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ |
| **పంచాయితీరాజ్ వ్యవస్థలో మూడు అంచెలు, ఆరు పదవులు ఉన్నాయి.** |

---

**భారత రాజ్యాంగం 1950** **ఆదేశిక సూత్రాలు పార్ట్ -IV**

- యూనియన్ ప్రభుత్వం
- రాష్ట్ర ప్రభుత్వాలు
- రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ఆధారంగా స్థానిక స్వపరిపాలన ప్రభుత్వాలు (లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ )

---

**భారత రాజ్యాంగం అధికారాల విభజన 7వ షెడ్యూలు**

- **యూనియన్ ప్రభుత్వం** – యూనియన్ ప్రభుత్వ అధికారాలు
- **ఉమ్మడి జాబితా** – యూనియన్, రాష్ట్రాలు
- **రాష్ట్ర ప్రభుత్వాలు** – రాష్ట్రప్రభుత్వాల జాబితా

---

**భారత రాజ్యాంగం 1950లో పేర్కొన్న అధికార వికేంద్రీకరణ సరైన నమూనా**

భారత రాజ్యాంగంలోని 73,74వ సవరణలు 1993 తరువాత

- **యూనియన్ ప్రభుత్వం**
- **రాష్ట్ర ప్రభుత్వాలు**
- **స్థానిక పభుత్వాలు**
  - గ్రామీణ ప్రభుత్వాలు
    - గ్రామ, మండల, జిల్లా ప్రభుత్వాలు
  - పట్టణ ప్రభుత్వాలు
    - మెట్రో నగరాలు, నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు

# జాతీయ, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు ఆర్థిక అధికారాలు

**1. జాతీయ ప్రభుత్వం- దేశంలో ప్రత్యక్ష, పరోక్ష పన్నులు విధించి వసూలు చేసుకునే అధికారం**

**2. రాష్ట్ర ప్రభుత్వాలు - రాష్ట్రాల్లో ప్రత్యక్ష, పరోక్ష పన్నులు విధించి వసూలు చేసుకునే అధికారం**

**3. స్థానిక ప్రభుత్వాలు - స్థానిక ప్రభుత్వాల పరిధిలో ప్రత్యక్ష పన్నులు విధించి వసూలు చేసుకునే అధికారం**

## ఆర్థిక వనరుల పంపిణీ

యూనియన్ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక సంఘాల నివేదిక ప్రకారం 32 శాతం నిధులను రాష్ట్రాలకు కేటాయిస్తుంది. ఇవి కాకుండా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (NREGP) సర్వశిక్ష అభియాన్ (SSA), జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (NRHM) జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ పునరుజ్జీవన మిషన్ (JNNURM) పథకాల ద్వారా యూనియన్ ప్రభుత్వం రాష్ట్రాలకు సరాసరి నిధులు కేటాయిస్తుంది. ప్రజాపంపిణీ వ్యవస్థ (PDS) ఎరువులు, ఇంధన సబ్సిడీల ద్వారా రైతులకి, మిగతా ప్రజలకి సరాసరి నిధులను విడుదల చేస్తుంది. వీటితో కలుపుకుంటే యూనియన్ ప్రభుత్వం రాష్ట్రాలకి సుమారు 45% నిధులను కేటాయిస్తుంది.

| | | |
|---|---|---|
| 1. భారత ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రాష్ట్రాలకు కేటాయించే నిధుల శాతం | - | 32% |
| 2. NREGP, NRHM, JNNURM, PDS, SSA పథకాలు<br>3. ఎరువులు, ఇంధన సబ్సిడీలు | - | 13% |
| **భారత ప్రభుత్వం రాష్ట్రాలకి కేటాయిస్తున్న మొత్తం నిధుల శాతం** | - | **45%** |

**రాష్ట్రప్రభుత్వాలు భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న ఆర్థిక వనరుల శాతం - 50%**
**మరో 5% నిధుల్ని కేటాయిస్తే రాష్ట్రాల కోరిక నెరవేరుతుంది.**

రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక ప్రభుత్వాలైన జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు కేటాయిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే తలసరి గ్రాంటు మనిషికి ఒక్కంటికి ఈ విధంగా వున్నాయి.

**1. గ్రామ పంచాయతీలకు రూ॥ 4**

**2. మండల పరిషత్‌కు రూ॥ 8**

**3. జిల్లా పరిషత్ రూ॥ 4**

**భారతప్రభుత్వాన్ని 50% నిధులు ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వాలు డిమాండ్ చేస్తున్నాయి. కాని స్థానిక ప్రభుత్వాలకి మన రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే నిధులు చూస్తే బడ్జెట్‌లో 2% కూడా ఉండదు. స్థానిక ప్రభుత్వాలకు రాష్ట్ర ప్రభుత్వం 50% నిధుల్ని కేటాయిస్తే తలకొక్కంటికి రూ॥ 1000/- గ్రాంటు లభిస్తుంది. అధికారాలని, నిధులను వికేంద్రీకరిస్తూ నిధులను కూడా సమకూరిస్తే స్థానిక ప్రభుత్వాల సాధికారత నిజం అవుతుంది. కాని ఆ వైపుగా ఆలోచించకుండా మన రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం నించి వాటాకోసం చూస్తుంది తప్ప తాను కిందనున్న స్థానిక ప్రభుత్వాలకు నిధులు విడుదల చేయడం లేదు. రాష్ట్రాల ఆర్థిక సంఘాల సూచనల్ని అమలు చేయడం లేదు.**

## మమత, జయ, అఖిలేష్, ఒమర్...

# "ఎన్నికల్ని తమాషా అనుకోకుండా సరైనవారికి ఓటు వేయటానికి మనకు ఇంకెన్ని గుణపాఠాలు కావాలి?"

***మార్చి 18, 2012.. సమయం సాయంత్రం 5గంటలు...***

***అప్పటిదాగా ఉగ్గబట్టుకుని వున్నట్టు, ఒక్కసారిగా కట్టుబాట్లు తెగిపోయినట్టు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన న్యూస్ ఛానళ్లు ఒళ్లు విరుచుకున్నాయి. బిగ్‌బ్యాంగ్‌తో ఎగ్జిట్‌పోల్స్ ప్రకటనకు, విశ్లేషణలకు తెరతీశాయి. అప్పటికే వండిపెట్టుకున్న మసాలా కిచిడీని వడ్డించేందుకు హడావుడి ప్రారంభించాయి... మీ అంచనా కరెక్టే.. మనందరికీ ఇంకా కొంతయినా గుర్తున్న ఏడు అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల ఎగ్జిట్‌పోల్ ఫలితాల గురించే ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్నది.***

ఆ ఉప ఎన్నికలలో దాదాపు రూ.200కోట్లు అక్రమంగా సాంప్రదాయ, పెత్తందారీ పార్టీలు ఖర్చుపెట్టినట్టు మీడియాలో విస్తృతంగా కథనాలు వచ్చాయి. ఆ నియోజకవర్గాలలోని ఏ మూలకెళ్లినా ప్రజలే నోటిమాటగా ఆ బహిరంగ రహస్యాన్ని చెప్పారు. ఒక్క నెల్లూరు జిల్లా కోవూరులోనే కాంగ్రెస్, తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు కలిసి ఒక్కో ఓటుకు రూ.1700 ఇచ్చాయని, మొత్తంగా ఆ నియోజకవర్గంలోనే రూ.70కోట్ల వరకూ అక్రమంగా డబ్బు ఖర్చుచేశారని నిర్దిష్టమైన ఆరోపణలు వచ్చాయి. అలాంటి ఎన్నికల మీద ఎగ్జిట్‌పోల్స్ చర్చనే మనం మార్చి 18వ తేదీన టీవీ న్యూస్ ఛానల్స్‌లో చూసింది. ఆరోజున పోలింగ్ గడువు ముగిశాక ఖచ్చితంగా 5గంటలకు చర్చను మొదలుపెట్టారు. అందులో తప్పేమీ లేదు. తమ వృత్తిధర్మంలో భాగంగానే వీక్షకులను ఆకట్టుకునేందుకు చేసే ప్రయత్నంగానే వారు ఈ కార్యక్రమం చేపట్టారు. కానీ అన్నికోట్లు అక్రమంగా ఖర్చు పెట్టి ప్రజాస్వామ్యాన్ని పరిహసించిన ఎన్నికలలో ఆ అక్రమంలో భాగస్వాములైన పార్టీ గెలుపు అనేది ఒక వార్త అవుతుందా? ఆ విజయానికి ప్రాధాన్యత ఉంటుందా? కేవలం రికార్డులలో రాసుకోవటానికి తప్ప. ఆ ఎన్నికలు జరిగిన రోజు ముందుగా చేయాల్సింది ఏమిటి? వంచనతో, మభ్యపెట్టి ప్రజాభిప్రాయాన్ని మలుస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ప్రజాస్వామ్యాన్ని ఎలా రక్షించాలో, అందుకు ఎలాంటి ఎన్నికల సంస్కరణలను తీసుకురావాలో ముందుగా చర్చించాలి. చాలా సీరియస్ చర్చ జరగాలి. ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయమే అంతిమం. కానీ ప్రజాభిప్రాయం అంటే ఏమిటి? మోసంతో, ప్రలోభాలతో ప్రజల్ని లొంగదీసుకుని ప్రజాభిప్రాయాన్ని మలచటం కాదు. జీసస్ క్రీస్తును శిలువ వేయమని చెప్పింది కూడా జనాభిప్రాయమే. ఏ ప్రజల కోసం జీసస్ తన జీవితపర్యంతం వెచ్చించారో ఆ ప్రజలనే అధర్మ, అన్యాయ పద్ధతులలో కుట్రపూరితంగా లంగదీసుకుని, వారి చేతే వారు దేవుడుగా భావించే జీసస్‌కు శిలువ వేయాలని చెప్పించారు. కాబట్టి అదేరీతిలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ జరిగిన ఎన్నికలలో గెలుపు ఓటములకన్నా ఎన్నికల వ్యవస్థను ఎలా బాగుచేయాలో ముందు చర్చించాలి. కానీ మార్చి 18న ఆయా ఛానల్స్‌లో జరిగిన ఎగ్జిట్ పోల్ చర్చలలో రాష్ట్రంలోని చాలా సీనియర్ జర్నలిస్టులు కూడా పాలుపంచుకుని, ఎక్కడా ఎన్నికలలో జరిగన అక్రమాల గురించి మాట్లాడకుండా ఎవరికి ఎక్కువ, ఎవరికి తక్కువ శాతం ఓట్లు వస్తున్నాయి, ఏ వర్గం ఎటు మొగ్గుచూపుతోంది, ఎవరు ఎవరి ఓటుబ్యాంకుగా మారారు వంటి అంశాలపై చర్చలు జరపటం చూస్తే చాలా బాధనిపించింది. ప్రజలకు మార్గదర్శకత్వం చేసి వ్యవస్థలను పరిపుష్టం చేసి సక్రమంగా పనిచేయించాల్సిన వారు ఇలా ప్రజల్ని మౌలికసమస్యల నుంచి పక్కదోవ పట్టించే చర్చలు చేయటం, అందులో పాల్గొనటం విషాదకరం.

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు మళ్లీ ఉప ఎన్నికలు వస్తున్నాయి. 18 అసెంబ్లీ స్థానాలకు, ఒక లోక్‌సభ స్థానానికి జూన్ 12న ఎన్నికలు జరగబోతున్నాయి. అవకాశవాదం, స్వార్థం, రాజకీయ దురహంకారంతో కొందరు ఈ ఎన్నికలను ప్రజల నెత్తిన రుద్దారు. గతంలో చేసిన తప్పిదాలను సరిదిద్దుకుని, ఈసారైనా కొంత ఆలోచనతో సరైన అభ్యర్థికి, పార్టీకి ప్రజలు ఓటువేస్తారని,

అందుకు మీడియా తన ప్రచారంతో సహకరిస్తుందనే ఆశతో ఈ ఆవేదనను పంచుకుంటున్నాను.

సహ ప్రజలారా! ఓటుకు వెయ్యో, రెండువేలో డబ్బు తీసుకుని, ఓ బ్రాందీసీసా తీసుకుని ఓటు వేస్తే మన దేశానికి, మన బిడ్డల భవిష్యత్తుకు ఎంత ద్రోహం చేసినవారమవుతామో ఒక్కసారి ఆలోచించండి. ఎన్నికలలో కోట్ల రూపాయలు డబ్బు గుమ్మరించేవాడు తిరిగి ఆ కోట్లు దండుకోవటానికి ప్రయత్నిస్తాడు తప్ప మనకేదైనా మేలు చేస్తాడా? ఒక్కసారి ఆలోచించండి. ఎన్నికలు ఒక తమాషా కాదు, మన జీవితాలు ఏమవబోతున్నాయో నిర్ణయించే కీలకఘట్టాలు. ఎన్నికలను కుస్తీపోటీలలాగా, గుర్రపు పందాలలాగా భావించి బాధ్యతారహితంగా ఓటు వేస్తే అది మనల్ని మనమే అవమానించుకున్నట్టువుతుంది. ఆత్మగౌరవం అంటే నినాదాలివ్వటం, దౌర్జన్యాలు చేయటం కాదు... ఒక లక్ష్యం కోసం, ధర్మం కోసం నిలబడి సరైనరీతిలో ఓటు హక్కును వినియోగించుకుని, సరైన వ్యవస్థ నిర్మాణంలో భాగస్వామి కావటం. ఎన్నికలంటే ఎవరో కొందరు మహారాజులు మందీమార్బలంతో యుద్ధం చేస్తుంటే మనం ప్రేక్షకుల్లా చూడటం కాదు. మన తరుపున మన కోసం పనిచేసే నిబద్ధతగల వ్యక్తులను, పార్టీలను ఎన్నుకోవటం.

మన కళ్లముందు కొంతకాలం క్రితం జరిగిన కొన్ని ఎన్నికల్నే కాస్త గుర్తుచేసుకోండి.

మమతా బెనర్జీ... పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష కూటమి ప్రభుత్వం మూడు దశాబ్దాలపాటు పరిపాలించినా చెయ్యాల్సిన పనులు సక్రమంగా చెయ్యలేదనే కోపంతో మమతా బెనర్జీని అక్కడి ప్రజలు గెలిపించారు. తాము కోల్పోయినదేదో మమత అందిస్తారనే ఆశతో ఆమెను ముఖ్యమంత్రిని చేశారు. భారతదేశవ్యాప్తంగా కూడా చాలామంది మమత విధ్వంసకర రాజకీయాన్ని, అందుకు లభిస్తున్న ప్రచారాన్ని చూసి ఆహా, ఓహో అనుకున్నారు. ఆమెనో కాళీమాతగా, సాహసవనితగా భావించారు. కానీ మమతకు అంత శక్తి వుందా? తాము కోరుకుంటున్న మార్పును సాధించే సత్తా ఆమెకు ఉందా? అని మనసులో తలెత్తుతున్న సందేహాలను అక్కడి ప్రజలు కాస్తయినా పట్టించుకోలేదు. ఆ ధోరణిలో ఆలోచించే ప్రయత్నమే చేయలేదు. మార్పు కావాలంటే సరైనవాళ్లు ఎవరు, అలాంటి వేదిక ఏది అనే పరిశీలనే చేయకుండా పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు ఓటు వేశారు. మమత గెలిచి 11నెలలు పూర్తయ్యాక చూస్తే... ఆమె పట్ల పశ్చిమ బెంగాల్ ప్రజలకే కాదు యావత్ భారతదేశ ప్రజలకు కూడా విరక్తి కలుగుతోంది.



అలాగే రెండో ఉదాహరణ అఖిలేష్. ఉత్తర ప్రదేశ్‌లో మాయావతిని గద్దెదించి ఆ యువకుడు అధికారంలోకి రావటాన్ని భారతదేశంలోని మీడియా మొత్తం ఆకాశానికెత్తేసింది. యు.పిలో అఖిలేష్... ఎ.పిలో లోకేష్ (చంద్రబాబు కుమారుడు) అని, వైఎస్ జగన్మోహన రెడ్డికి అఖిలేష్ మంచిమిత్రుడని, ఆయనతో టచ్‌లో ఉంటున్నారని మన రాష్ట్రంలో పెద్దప్రచారమే జరిగింది. కానీ ఒక్కసారి లోతుగా ఆలోచిస్తే నేరచరిత్రులకు టికెట్లు, మంత్రిపదవులు కూడా ఇచ్చిన ఆ పార్టీ మాయావతి కంటే భిన్నంగా ఏమీ పనిచేయటంలేదని స్పష్టమవుతోంది. అఖిలేష్ పార్టీ ఎస్.పికి, మాయావతి పార్టీ బి.ఎస్.పికి తేడా ఏమీ కనిపించటం లేదక్కడ. అలాంటి తేడా ఉండే అవకాశమే లేదని అర్థమవుతున్నా పట్టించుకోకుండా ఓటర్లు అఖిలేష్‌కు పట్టం కట్టారక్కడ.

ఇక తమిళనాడులో జయలలిత. పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్‌లోలాగా ఏదో కొత్తముఖానికి ఓటు వేసేంత వెంట్రుకవాసి మెరుగైన అవకాశం కూడా తమిళ ప్రజలకు లభించలేదు. జయలలితకు చెందిన ఎఐడిఎంకెకు, కరుణానిధి కుటుంబానికి చెందిన డిఎంకెకు మధ్య ఓట్లు వేయటమే వారి పని. తేడా ఏమిటంటే- ఉచితాలను ఎవరు ఎక్కువ ఇచ్చారు. ఆ రెండు పార్టీల మధ్య తేడా ఏమిటో, వారి వల్ల తమకు

ఒరిగేదేమిలో ప్రజలు ఎన్నడూ పట్టించుకున్న దాఖలాలు లేవు. జయలలిత కొన్నాళ్లు ప్రతిపక్షంలో, అజ్ఞాతవాసంలో ఉంటే మారిపోయినట్టని భావించగలుగుతామా?

ఇంకో ఉదాహరణ ఒమర్ అబ్దుల్లా. ఎన్నో ఆశలతో, చాలా సానుకూల వాతావరణం మధ్య, చాలా క్రేజీగా ఈ యువకుడ్ని జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రిని చేశారు. ఈ యువ ముఖ్యమంత్రి కనీసస్థాయిలో కూడా ఫలితాలను సాధించలేక చతికిలపడ్డారు.

పై నాలుగు రాష్ట్రాలలో విజేతల ఉదాహరణలను చెబుతూ ప్రముఖ జర్నలిస్ట్ ప్రీతిష్ నంది ఇటీవల రాసిన ఒక వ్యాసంలో ఇలా పేర్కొన్నారు... "సమస్య ఏమిటంటే- మనకు మార్పు అక్కర్లేదు. విఫలమైనవాళ్లను కిందకు తన్నేయటమే మనకు ఇష్టం. అలా ఎవరినైనా పడగొడితే చాలు మనకు చాలా అధికారమున్నట్టు తెగ సంతృప్తి పడిపోతాం. పాత పార్టీకి వారసునిగా కొత్తగా ఎన్నికైన నేత కూడా అదే తానులో గుడ్డ కాబట్టి ఆ నాయకుడు కూడా విఫలమవుతాడు, మనకు ముఖం మొత్తి నిరాశనిస్పృహలు, ఆగ్రహం వచ్చేస్తాయి. కొత్త నాయకుడు లేదా నాయకురాలిని తిడుతుండటం మొదలుపెడతాం. భారతదేశాన్ని మార్చటానికి నిఖార్సయిన ఎజెండాతో ముందుకొచ్చే వ్యక్తులను, పార్టీలను ఆదరించటానికి మనం ఎప్పుడూ సీరియస్ ప్రయత్నం చేయలేదు. సమస్యలేమిటో మనందరికీ దాదాపు తెలుసు. కానీ ఎన్నికలు వచ్చే సమయానికి మనమందరం ప్రజాప్రతినిధుల ఎన్నికను తమాషాలాగా జరుపుకుంటాం. రాజకీయాలనేవి ఈవేళ ఒకరకమైన వినోదంలా మారిపోయాయి. సమాజంలో పేరుపొందినవాళ్లు వచ్చి ఓట్ల కోసం చేయిజాస్తుంటే మనకోవిధమైన ఉద్వేగంగా, ఉత్కంఠగా అనిపిస్తుంటుంది. అంతకుమించిన సీరియస్ ఆలోచనే కలగటం లేదు. రాజకీయాల్ని ఓ రంగులక్రీడగా భావిస్తూ కొద్దిమంది నేతల కోసం ఎన్నికలనే భావనలో కొట్టుకుపోతూ భారతదేశాన్ని మెరుగుపరచటం కోసం చేయాల్సిన కష్టాన్ని, అవిశ్రాంత కృషిని మాత్రం మనం వదిలేస్తున్నాం. కేవలం మన బాధ్యతారాహిత్యం, జూదస్వభావం వల్లే భారతదేశం అన్ని వనరులూ, అవకాశాలూ వున్నా అగ్రరాజ్యస్థాయి దిశగా ముందుకెళ్లలేక పోతోంది".

మీడియా పుణ్యమాని మమత, అఖిలేష్ , జయ, ఒమర్ గురించి మన రాష్ట్ర ప్రజలకు కూడా బాగానే తెలుసు. అలాంటి విఫల నాయకుల గురించి ఆయా రాష్ట్రాల ప్రజలు సక్రమంగా ఆలోచించకపోవటం వల్ల, సరైన ప్రత్యామ్నాయాన్ని పట్టించుకోవటం వల్ల ఎంత నష్టపోతున్నారో ఆంధ్రప్రదేశ్ ప్రజలు గుర్తించాలి. సమస్యల్ని, పరిష్కారాల్ని స్పష్టంగా గుర్తించి, ఆ పరిష్కారాలను నిజాయతీగా సాధించి మనకు, మన భవిష్యత్తు తరాలకు మేలు చేయగల పార్టీకే ఓటువేసేందుకు మన రాష్ట్ర ప్రజలు సన్నద్ధమవ్వాలి.

రాష్ట్రంలోని కడప అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన రెడ్డిని భారీ మెజారిటీతో లోక్‌సభకు పంపారు. ఒక్కసారైనా ప్రజాసమస్యల మీద నిర్దిష్టంగా, పరిష్కారం దిశగా ఎన్నిసార్లు ఆయన లోక్‌సభలో మాట్లాడారో గమనించారా? దేశమంతా అవినీతి అంతానికి లోక్‌పాల్‌ను కోరుకుంటుంటే, ఆ లోక్‌పాల్‌పై చర్చ సమయంలో జగన్ సభలో లేరు. అలాగే తన పార్టీ సంక్షోభాన్ని రాష్ట్రప్రజల మీద రుద్ది ప్రజల జీవితాలతో ఆడుకుంటున్న కాంగ్రెస్ పార్టీ తీరును, రైతులకు కాస్త మంచి ధర ఇచ్చే విషయంలో, అవినీతి నిర్మూలన, అసెంబ్లీ నిర్వహణ, రోజువారీ పరిపాలన, స్థానికసంస్థల విషయాలలో ముఖ్యమంత్రి ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి ఎంత ఉదాసీనంగా అధ్వాన్నంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోండి. మరోవైపు, ప్రతిపక్ష నేతగా తెలుగుదేశం అధ్యక్షుడు అసెంబ్లీ సమయాన్ని ఎంతగా దుర్వినియోగం చేశారో, కాంగ్రెస్ వ్యతిరేకతే తప్ప అసలు సమస్యలు పరిష్కరించకుండా కేవలం అధికారంలో రావాలనే ధ్యాసతో ఎలా కాలక్షేపం చేస్తున్నారో, మద్యం, అవినీతి, అధికార కేంద్రీకరణ, తెలంగాణ తదితర కీలక అంశాలపై ఆయన ఎంత కప్పదాటు వైఖరితో వ్యవహరిస్తున్నారో గుర్తించండి. ఆ మూడు సాంప్రదాయ రాజకీయ తోడేళ్లు కొట్టుకుంటున్నది గొర్రెపిల్లల్లాంటి మనల్ని తినటానికేననే విషయాన్ని మర్చిపోయి మనం ఆ పార్టీల మధ్య కొట్లాటలను వినోదంగా ఆనందిస్తున్నాం. పూర్వం రాజులు ప్రజల తలకాయల్ని తెగనరికేవారు, ఇప్పుడు ఆ సా.రా పార్టీలు రక్తం చుక్క కనిపించకుండా ప్రజల జీవితాల్ని తెగనరుకుతున్నాయి. అంతే తేడా. ఆ మూడు పార్టీల తోడేళ్ల తరహా పోరాటాన్ని ఓ వినోదంగా చూడటం ఆపి, ఎన్నికలు తమాషా అనే భావన నుంచి బైటపడి ఆ మూడు పార్టీలకు ప్రత్యామ్నాయంగా మంచి రాజకీయాన్నిచ్చే విధానాలున్న సీరియస్ పార్టీకే ఓటువేయండి. అలాగే ప్రజలు ఓటును సద్వినియోగం చేసుకుని జనరాజకీయానికి పట్టంగట్టేలా చర్చను మలిచి వారిని సీరియస్ రాజకీయాలవైపు మళ్లించటంలో కీలకపాత్ర పోషించేందుకు మీడియా కూడా కదలాలి. మనందరిలోని మార్పును చూపటానికి ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 12న జరగనున్న ఉప ఎన్నికలు ఓ చక్కటి అవకాశం. ◆

**-21వ శతాబ్దపు భారతీయుడు**

# రాష్ట్రాల గోడు పట్టదా?

## కేంద్రం గుప్పిట్లో ఆర్థికాధికారాలు



కె. నాగేశ్వర్
(రచయిత రాష్ట్ర శాసనమండలి సభ్యులు,
ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జర్నలిజం శాఖ ప్రొఫెసర్)

**భారతదేశం సాధారణ పరిస్థితుల్లో సమాఖ్య వ్యవస్థగా కొనసాగుతుంది, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఏకీకృత రాజ్యంగా ఉంటుంది. రాజ్యాంగంపై నిర్ణాయక సభలో డాక్టర్ అంబేద్కర్ ఇచ్చిన వివరణ ఇది.**

కానీ, రాజ్యాంగ నిర్మాత ఆశయాలకు భిన్నంగా స్వతంత్ర భారత ప్రస్థానం సాగుతూ వచ్చింది. కేంద్ర, రాష్ట్ర సంబంధాల చారిత్రక పరిణామాన్ని పరిశీలిస్తే ఓ విషయం కచ్చితంగా అవగతమవుతుంది. పరిపాలన, చట్టపరమైన, ఆర్థికపరమైన అధికారాలను కేంద్రం తన చేతుల్లో పెట్టుకునే ధోరణి రోజురోజుకూ పెరుగుతోంది. జాతీయపార్టీల ప్రాబల్యం తగ్గడం, ప్రాంతీయ పక్షాలు దేశ రాజకీయ వ్యవస్థలో బల పుంజుకోవడం, సంకీర్ణ రాజకీయాల యుగం ఆవిష్కృతం కావడంతో రాష్ట్రాలవైపు నుంచి అధికారాలు కావాలన్న డిమాండు గట్టిగా వినబడుతోంది. ఉగ్రవాద జాతీయ వ్యతిరేక కేంద్రం(ఎన్‌సీటీసీ) మొదలు పన్నుల్లో న్యాయమైన వాటా వంటి పలు అంశాలకు సంబంధించీ ప్రాంతీయ పార్టీల వాదనకు పదును పెరిగింది.

### అధికార కేంద్రీకరణతో అనర్థం

దేశ ఆర్థికవ్యవస్థలో అధికార కేంద్రీకరణ తీవ్రస్థాయికి చేరింది. కేంద్రంతో పోలిస్తే రాష్ట్రాల వనరుల సమీకరణ సామర్థ్యం చాలా తక్కువ. అభివృద్ధిఖి సంబంధించిన బాధ్యతలు రాష్ట్రప్రభుత్వాలపై మితిమీరుతున్నాయి. అభివృద్ధి కార్యక్రమాల విషయంలో రాజ్యాంగం రాష్ట్రాలపైనే కీలక బాధ్యతలు మోపింది. ప్రజల జీవితాలను నేరుగా ప్రభావితం చేసే నీటిపారుదల, రోడ్లు భవనాలు, వైద్యం, ఆరోగ్యం, విద్యుచ్ఛక్తి, వ్యవసాయం, మౌలిక వసతుల కల్పన వంటి విషయాల్లో రాష్ట్రప్రభుత్వాలదే పూర్తి బాధ్యత. ఇక రాష్ట్ర ప్రభుత్వాలు పాలనపరమైన అంశాలపై చేసే వ్యయమూ తక్కువేమీ కాదు. ముఖ్యంగా శాంతి భద్రతలు, సాధారణ పాలన బాధ్యతలను రాష్ట్రాలే చూసుకోవాలి. కానీ, వనరుల సమీకరణ అధికారాలన్నీ చాలా వరకు కేంద్రం చేతుల్లోనే ఉన్నాయి. ఫలితంగా కేంద్ర, రాష్ట్ర ఆర్థికాధికారాల మధ్య తీవ్ర అసమానతలు నెలకొన్నాయి. కేంద్రంనుంచి రాష్ట్రాలకు నిధుల బదిలీ చాలినంతగా లేదు. దీంతో రాష్ట్రాలు పాలన సంబంధమైన సవాళ్లను ఎదుర్కోవలసి వస్తోంది. ఉదాహరకు- అన్ని రాష్ట్రప్రభుత్వాలు కలిసి పోలీసులపై చేస్తున్న ఖర్చు తమ మొత్తం వ్యయంలో అయిదు శాతం లోపే. మళ్ళీ అందులో 80 శాతం పోలీసుల జీతభత్యాలకే పోతోంది. ఈ పరిస్థితుల్లో అంతర్గత భద్రత సవాళ్లను ఎదర్కొని- శాంతి భద్రతలు కాపాడటంలో రాష్ట్రాలు ఏ మేరకు తమ బాధ్యతలను సమర్థంగా నెరవేర్చగలుగుతాయి? పెరుగుతున్న అవసరాలను, బాధ్యతలను దృష్టిలో ఉంచుకొని- **కేంద్ర మొత్తం పన్నుల రాబడిలో కనీసం 50శాతాన్ని తమకు బదలాయించాలని రాష్ట్రాలు కోరుతున్నాయి.** ప్రస్తుతం అమలవుతున్న పదమూడో ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు పన్నుల్లో రాష్ట్రాల వాటా కేవలం 32శాతమే! అంతకు ముందున్న 30.5శాతం వాటాతో పోలిస్తే ఇది స్వల్పంగా అధికంగా రాష్ట్రాలకు సంబంధించిన ఆర్థిక అధికారాల్లో సమగ్ర మార్పులతో పాటు, కేంద్ర పన్నుల వాటా విషయంలో వ్యవస్థాగత సంస్కరణలు రావాలని రాష్ట్రసర్కార్లు కోరితే- పదమూడో ఆర్థిక సంఘం చేసింది నామమాత్రం! పన్నుల్లో వాటా, గ్రాంట్ల బదలాయింపు నిర్ణయాల్లో ఆర్థిక సంఘాలేవీ హేతుబద్ధ ప్రాతిపదికన సిఫార్సులు చేయలేదు. ఇందుకు 13వ ఆర్థిక సంఘం సైతం మినహాయింపు కాదన్నది నిపుణుల వాదన.

రాష్ట్రాల వాటా ఆశించిన మేర లేకపోవడమే కాదు, కొంతకాలంగా కేంద్రప్రభుత్వం అనుసరించిన సరళీకృత విధానాలవల్ల పన్నుల ద్వారా కేంద్రానికి వచ్చే ఆదాయమూ ఆశించిన స్థాయిలో లేదు. ఉదాహరణకు- దిగుమతి సుంకాలు

గణనీయంగా తగ్గాయి. ప్రత్యక్ష పన్నుల్లో కేంద్రప్రభుత్వం ప్రతీ బడ్జెట్లో రాయితీలు ఇస్తోంది. తాజా కేంద్ర బడ్జెట్లో ప్రతిపాదనలవల్ల కూడా ప్రత్యక్ష పన్నుల ద్వారా వచ్చే ఆదాయం సుమారు రూ॥4,500కోట్ల మేర పడిపోయింది. ప్రత్యక్ష పన్నుల తగ్గింపువల్ల ఆర్థిక వ్యవస్థలోకి పెట్టుబడుల ప్రవాహం పెరుగుతుందన్నది సరళీకరణ సిద్ధాంతం. మొత్తానికి రాష్ట్రాల ఆదాయానికి గండి పడుతోంది. స్థూలంగా ఆర్థికవ్యవస్థకు లాభం చేకూర్చే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాలు ప్రవేశపెట్టినప్పుడు ఆదాయ వనరుల విషయంలో రాష్ట్రాలు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యతను మరచిపోరాదు.

ఆర్థిక సరళీకరణ శకం ప్రారంభానికి ముందు ప్రభుత్వ పెట్టుబడులే కీలకంగా ఉండేవి. సంస్కరణల అనంతరం ఆర్థికాభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధికోసం రాష్ట్రప్రభుత్వాలు ప్రైవేటు రంగ పెట్టుబడులపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దేశ, విదేశ ప్రైవేటు పెట్టుబడులు ఆకర్షించేందుకు రాష్ట్రప్రభుత్వాలు పోటీపడి పన్నుల్లో రాయితీలు ప్రకటించడం మొదలు పెట్టాయి. రాష్ట్రాల ఆదాయ సమీకరణపై పెద్దయెత్తున ప్రతికూల ప్రభావం చూపిన పరిణామమిది. కేంద్రం సిబ్బందికి వేతన సవరణ చేసినా, కరువు భత్యం పెంచినా– రాష్ట్రాలూ అదే దారిలో నడవాల్సి ఉంటుంది. అప్పుడూ రాష్ట్ర సర్కార్ల వ్యయబాధ్యతలు పెరుగుతున్నాయి. రాష్ట్రాలు తీసుకున్న రుణాలపై వడ్డీ చెల్లింపుల భారమూ అధికమవుతోంది. చివరకు కేంద్రప్రభుత్వం రుణాల విషయంలోనూ ఈ భారం తప్పడంలేదు. రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల్లో సర్కారీ పెట్టుబడులపై వచ్చే ఆదాయం చాలా పరిమితంగా ఉంటుంది. ఇందుకు అనేక కారణాలున్నాయి. ఈ పరిణామాలన్నీ రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక స్థితిపై దుష్ప్రభావం కనబరుస్తున్నాయని కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ నివేదిక స్పష్టీకరించింది. జాతీయ విధానాల్లో మార్పుల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వాలపై పెరుగుతున్న ద్రవ్యపరమైన, సామాజిక, ఆర్థిక సమస్యలపై దృష్టిలో ఉంచుకుని కేంద్రం నుంచి రాష్ట్రాలకు నిధుల బదలాయింపు జరగాలి.

వ్యవసాయం రాష్ట్రాలకు సంబంధించిన అంశం అయినప్పటికీ– అంతర్జాతీయ ఒప్పందాలపై నిర్ణయాల్లో రాష్ట్రప్రభుత్వాలకు భాగస్వామ్యం లేదు. ప్రపంచ వాణిజ్య సంస్థకు సంబంధించిన చర్చల్లో, ఒప్పందాల్లో కేంద్రప్రభుత్వాలు ఏకపక్షంగా వ్యవహరించిన సందర్భాలు అనేకం. అంతర్జాతీయ వాణిజ్యం పై నిర్ణయాలు తీసుకునే అధికారం తమకు ఉందని కేంద్రప్రభుత్వం వాదించవచ్చు. పర్యవసానంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలకు కలిగే దుష్ప్రభావాలకు నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యతను కేంద్రం విస్మరించకూడదు.

**జాతీయదాయంలో వస్తున్న కాలానుగుణ మార్పులకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్రాల ఆర్థికాధికారాలు మారడంలేదు.**

ఉదాహరణకు, జాతీయాదాయంలో సేవలరంగం వాటా ప్రస్తుతం 59శాతానికి చేరింది. సేవల రంగంపై పన్నులు విధించే ధోరణి సైతం భాగా




పెరిగింది. కేంద్ర తాజా బడ్జెట్లో కొన్ని మినహా దాదాపు అన్ని రకాల సేవలనూ పన్నుల పరిధిలోకి చేర్చారు. అంతేకాకుండా సేవలపై పన్ను కూడా పెరిగింది. జాతీయాదాయంలో కీలక ప్రాధాన్యం సంతరించుకున్న ఈ రంగంపై రాష్ట్రాలకు అధికారాలు లేవు. ఆదాయ పంపిణీపై రాజ్యాంగబద్ధమైన వ్యవస్థాగత ఏర్పాట్లు ఉండాలని కేంద్ర, రాష్ట్ర సంబంధాలను అధ్యయనం చేసిన నిపుణులు సూచిస్తున్నారు. కేంద్రం నుంచి

రాష్ట్రాలకు వనరుల బదిలీ ప్రాతిపదికను సూచించడానికి బదులు– ఆర్థిక సంఘాన్ని నియమిస్తారు. ఇటీవలికాలంలో కేంద్రంనుంచి వివిధ రాష్ట్రాలకు వనరుల బదిలీకి ప్రాతిపదికను సూచించడం స్థానే, ఆర్థిక సంఘాలు అనేక షరతులతో కూడిన బదిలీలను ప్రతి పాదిస్తున్నాయి. దీనివల్ల రాష్ట్రాల పాలన అధికారానికి, చట్టాలను రూపొందించే హక్కుకు గ్రహణం పడుతోంది. ఇలాంటి షరతులతో కూడిన బదిలీలను సూచించడం, కేంద్ర పథకాలకు నిధుల కేటాయింపుల్లో షరతులు పెట్టడం రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. కేంద్రానికి విస్తృతమైన పన్నుల అధికారాలున్నాయి. ప్రత్యక్ష పన్నులు విధించే అధికారాలు కేంద్రానికే చాలావరకు దఖలుపడ్డాయి. ఉదాహరణకు– వ్యక్తిగత ఆదాయ పన్ను కార్పొరేట్ పన్ను, ఆస్తి పన్ను మొదలైన ప్రత్యక్ష పన్నులు, ఎక్సైజ్ సుంకం, కస్టమ్స్ సుంకం, సేవల పన్ను వంటి పరోక్ష పన్నులను విధించే అధికారాలు కేంద్రానికే ఉన్నాయి. ఇవి పోను పోను గణనీయంగా పెరుగుతున్నాయి. కానీ, రాష్ట్రాలకు పన్నులు విధించే అధికారాలు పరిమితం. ఎక్సైజ్ పన్ను, 'వ్యాట్' వంటివి పరిమితంగానే రాష్ట్రాలకు దఖలుపడ్డాయి. ఈ పన్నుల ద్వారా రాష్ట్రాలకు వచ్చే ఆదాయాన్ని కేంద్ర ఆదాయంతో సరిపోల్చి చూస్తే, ఏమాత్రం పెరుగుదల కనిపించడంలేదు.

## ఫిఫ్టీ ఫిఫ్టీ .... చెరిసగం వాటా

కేంద్రంనుంచి రాష్ట్రాలకు పన్నుల బదిలీ, గ్రాంట్ల కేటాయింపు వంటి విషయాల్లో ఆర్థిక సంఘాలు రెండు రకాల అసమానతలను దృష్టిలో ఉంచుకోవాలి. మొదటిది– కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య పెరుగుతున్న ఆదాయ అగాథం. వివిధ రాష్ట్రాల ఆర్థిక సామర్థ్యంలో హెచ్చుతగ్గులున్నా– వాటికి ఒకేరకమైన సామాజిక, ఆర్థిక బాధ్యతలు ఉంటాయన్న విషయాన్ని గమనించడం రెండోది. ఆ మేరకు పన్నుల ఆదాయాన్ని బదలాయించాలి. **ఇది జరగాలంటే ప్రస్తుతం ఉన్న వాటాను 50 శాతానికి పెంచాలి. దేశం మొత్తం ఆదాయంలో 60 శాతం మేర కేంద్రానికి పోతోంది. మిగిలిన 40 శాతం రాష్ట్రాలకు వెళ్తోంది. కానీ, మొత్తం రెవిన్యూ వ్యయంలో రాష్ట్రాల భారం– 57శాతంగా ఉంటోంది. కేంద్ర పన్నుల్లో ప్రస్తుతం రాష్ట్రాల వాటా 32శాతమే. పన్నేతర ఆదాయాన్నీ కలుపుకొంటే రాష్ట్రాల ఆదాయాన్ని లెక్కగడితే అది 40 శాతంగా తేలుతోంది. ప్రణాళిక సంఘం, కేంద్ర మంత్రిత్వశాఖల నుంచి వచ్చే గ్రాంట్లను సైతం కలుపుకొని చూస్తే, ఈ 40శాతం వాటా నిగ్గుతేలుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థలో కేంద్ర ఆధిపత్యంలో మార్పు తీసుకురావాలి.** చిన్న చిన్న మార్పులవల్ల రాష్ట్రాలకు న్యాయం జరగదు. ఆర్థిక ఇక్కట్లు ఉన్నప్పటికీ అనేక రాష్ట్రాలు ద్రవ్య సమతుల్యత పాటిస్తున్నాయి. ద్రవ్యలోటును నిర్దేశిత స్థాయికి నియంత్రించాయి. రెవిన్యూ లోటును అధిగమించగలిగాయి. కేంద్రం మాత్రం 'ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ చట్టం అమలులో వెనకబడి ఉంది. ఆర్థిక మాంద్యం కాలంలో ద్రవ్య సమతుల్యత సాధించడం కష్టతరమే. మాంద్యం ముసురుకున్న పరిస్థితుల్లో రాష్ట్రాలమీదా ప్రభుత్వ పెట్టుబడులను పెంచాల్సిన బాధ్యత ఉంటుంది. దాన్ని విస్మరించి నిధుల కేటాయింపునకు, ద్రవ్య సమతుల్యత లక్ష్యాలకు మధ్య కేంద్ర సంస్థలు లంకెపెడుతున్నాయి. **త్వరలో రానుందంటున్న సరకులు, సేవల పన్ను (GST) అయినా కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న ఆర్థిక అసమానతలను సరిదిద్దుతుందా? అది సరకుల సేవల పన్ను విధించే పద్ధతి, పరిమాణంపై ఆధారపడుతుందని రంగరాజన్ లాంటివారు అభిప్రాయపడుతున్నారు.** ఈ నేపథ్యంలో– కేంద్ర, రాష్ట్రాల మధ్య తీవ్రమవుతున్న ఆర్థిక అసమానతలకు పగ్గం వేసే రీతిలోనే రాబోయే పన్నుల విధానం ఉండాలి. రాష్ట్రాల మధ్య తలసరి ఆదాయంలో, స్థూల రాష్ట్ర ఉత్పత్తిలో తీవ్ర అంతరాలున్నాయి. ఫలితంగా సామాజిక, ఆర్థిక ప్రాతిపదికల్లోనూ రాష్ట్రాల మధ్య అసమానతలు ఏర్పడుతున్నాయి. జనాభా, భౌగోళిక, వాతావరణ తారతమ్యాలవల్లా అంతరాష్ట్ర అసమానతలు పెరుగుతున్నాయి. రాజకీయ పక్షాలు, రాష్ట్ర ప్రభుత్వాలు– కేవలం సమస్య తలెత్తినప్పుడే స్పందించి, అధిక నిధులకోసం కేంద్రంతో బేరసారాలకు దిగడం అన్నది సరైంది కాదు. **కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంబంధాల్లో వ్యవస్థాగతమైన సంస్కరణల కోసం కృషిచేయాలి. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నిజమైన ఆర్థిక సమాఖ్యగా భారత్‌ను రూపొందించేందుకు నిర్మాణాత్మక రాజకీయ పోరాటం అవసరం. జాతీయ పార్టీల పలుకుబడి తగ్గి ప్రాంతీయ, చిన్న పక్షాల ప్రాబల్యం పెరుగుతున్న తరుణంలో– ఇలాంటి రాజకీయ పోరాటం ఆవశ్యకత మరింత** పెరిగింది. ◆

(ఈనాడు సౌజన్యంతో....)

# ఆనాటి...స్ఫూర్తి ఏదీ...

- మైత్రి

**రాజకీయాల్లో ఓనమాలు తెలియనివారు వస్తున్నారు. డైరక్ట్ రిక్రూర్ట్‌మెంట్ పెరిగాయి. నాయకుడి కొడుకో, కూతురో, తల్లో, చెల్లో, అన్నో, తమ్ముడో, బామ్మర్ధో, మేనల్లుడో ఇలా వారసత్వ రాజకీయాలు ముదిరిపోయాయి. ప్రజాపక్షం వహించి ప్రజల్లోంచి వచ్చిన నాయకులు కరువయ్యారు. స్థానిక ప్రభుత్వాల నుండి వచ్చిన వారికి నాయకత్వ పటిమ ఉండదని విమర్శిస్తున్నారు. అలాగే మహిళా నాయకత్వం పట్ల కూడా రాజకీయాల్లో చులకన భావం వుంది. కాని ఆనాడు గ్రామీణ స్థానిక నాయకత్వమే జాతీయస్థాయికి ఎలా ఎదిగిందో, జాతీయ ఉద్యమంలో మహిళలెందరో వీరోచితంగా పోరాడి ప్రాణాలు అర్పించిన వారు ఆ తరువాత పదవులు అలంకరించిన వారు ఎందరో వున్నారని తెలిపే వ్యాసమిది.**

భారతదేశాన్ని బ్రిటీష్‌వాళ్ళు పరిపాలిస్తున్న రోజులవి. జాతీయోద్యమం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కెరటంలా వుంది. మెల్లమెల్లగా స్థానిక పట్టణ ప్రభుత్వాలను పరిపాలించడానికి భారతీయులకు అవకాశం లభిస్తుంది. కలకత్తా, మద్రాసు, బొంబాయి లాంటి మహానగరాలకి నగర పాలక వర్గాలను ఎన్నుకుంటున్నారు. అలా కలకత్తా మహానగరానికి మేయర్‌గా చిత్తరంజన్ దాస్ ఎన్నికయ్యారు. కలకత్తా కమీషనర్‌గా ఎవర్ని నియామకం చేయాలనే విషయంలో బ్రిటీష్ ప్రభుత్వంతో ఉత్తరప్రత్యుత్తరాలు జరిపారు. చిత్తరంజన్ దాస్ ఎవరిని కోరుకుంటే వారినే కమీషనర్‌గా నియమిస్తానని బ్రిటీష్ ప్రభుత్వం తెలిపింది. వెంటనే అప్పటికే సివిల్ సర్వీసెస్‌లో అగ్రగామిగా నిలచిన ఒక 22 ఏళ్ళ యువకుడిని ఎంపిక చేసుకుని కమీషనర్‌గా నియమించమని చిత్తరంజన్ దాస్ కోరారు. ఇంకేముంది వెంటనే బ్రిటీష్ ప్రభుత్వం ఆ కోర్కెను మన్నించింది. ఒక అనుభవజ్ఞుడైన నాయకుడు మరొక యువకుడైన అధికారి జోడెడ్ల బండివలె పరిపాలన సజావుగా సాగి పోతుంది. నగర పాలన నల్లేరుమీద నడకే అయింది. ఇంతలో జాతీయోద్యమం లో పాల్గొంటు న్నాడని ఆ యువకుడైన కమీషనర్‌ను ప్రభుత్వం అరెస్టు చేసి, కలకత్తా జైల్లో నిర్భంధించింది. ఆ కారణంగా కలకత్తా కమీషనర్‌గా వేరొకరిని సూచించాల్సిందిగా చిత్తరంజన్ దాస్‌ను కోరింది. కాని ఆయన దానికి ససేమిరా అన్నారు. కలకత్తా కమీషనర్‌గా ఏమైనా అక్రమాలు చేసివుంటే వాటికి శిక్ష వేయాలి కాని, జాతీయోద్యమంలో పాల్గొనడం వల్ల కలకత్తా నగర పాలనకి ఎలాంటి ఆటంకం కలగలేదని ఆయన వాదించారు. ఆ యువకుడైన కమీషనర్‌నే కొనసాగించాలని ఆయన కోరారు. ఆ కోర్కెను బ్రిటీష్ ప్రభుత్వం మన్నించింది. జైల్లో వుంటూనే ఆ యువకుడు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. దీనికి విరుగుడు ఆలోచించిన బ్రిటీష్ ప్రభుత్వం ఆ యువకుడిని



చిత్తరంజన్ దాస్



సుభాష్ చంద్రబోస్



జవహర్‌లాల్ నెహ్రూ



లాల్ బహుదూర్ శాస్త్రి



పి.వి. నరసింహారావు

అండమాన్ నికోబార్ దీవులలోని జైలుకి పంపించింది. దాంతో కలకత్తాలో నివాసం వుండని కారణంగా కొత్త కమీషనర్‌ను నియమించింది.

పరాయిపాలనలో స్థానిక ప్రభుత్వ భారతీయ పాలకుడికి ఆ ప్రభుత్వం ఇచ్చిన విలువ అది. ఇంతకీ కలకత్తా కమీషనర్‌గా పనిచేసిన ఆ యువకుడి పేరు చెప్పలేదు కదూ.... ఆయనే సుభాష్ చంద్రబోస్. ఆయన ఆ తరువాత కలకత్తా మహానగరానికి మేయర్‌గా కూడా ఎన్నికయ్యారు. దేశం కోసం ప్రాణాలు అర్పించాడు. కాని నేడు చూస్తే మన స్వతంత్ర భారతదేశంలో స్థానిక ప్రభుత్వాలను ఎంత నిర్వీర్యం చేస్తున్నారో చెప్పనవసరం లేదు. కమీషనరే కాదు, ఆఫీసులో అటెండర్ పోస్టును కూడా రాష్ట్ర ప్రభుత్వాలే పై నించి నియమిస్తున్నాయి. మేయర్ గాని, మున్సిపల్ ఛైర్‌పర్సనే గాని ఎవరైనా ఉత్సవవిగ్రహాలుగా మాత్రమే మిగిలిపోతున్నారు. ప్రజల సొమ్మును పన్నుల రూపంలో వసూలు చేసి జీతభత్యాలు ఇస్తున్నా, పెత్తనం మాత్రం రాష్ట్ర కేంద్రప్రభుత్వాలదే అవుతుంది. పన్నుల డబ్బు జీతాలకు కూడా సరిపోకపోతే స్థానిక ప్రభుత్వాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను బిచ్చం అడిగే స్థితికి దిగజారాయి. ఇంతకంటే పరాయిపాలనే నయం అనిపిస్తుంది. పంచాయితీల నుండి, మున్సిపాలిటీల నుండి వచ్చిన వారికి నాయకత్వ లక్షణాలు వుండవని, సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడంలో వారికి అవసరమయిన పరిజ్ఞానం వుండదని, గ్రామీణ నాయకత్వాన్నే చులకన చేస్తున్నారు. కాని దేశంలో స్థానిక నాయకత్వం నుండే జాతీయ నాయకులుగా ఎదిగిన వారిని చూస్తే అందులో దేశ ప్రధానులుగా పనిచేసిన జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకుని లాల్ బహుదూర్ శాస్త్రి,



సరోజిని దేవి



కస్తూర్బా గాంధీ



ఝాన్సీలక్ష్మీబాయి

పి.వి. నరసింహరావు లాంటి వారిని చెప్పుకోవచ్చు. వీరే కాక మన రాష్ట్రంలో ప్రకాశం పంతులు, బూర్గుల రామకృష్ణా రావు, మాడపాటి హనుమంతరావు, జలగం వెంగళరావు లాంటి నాయకులు స్థానిక ప్రభుత్వాల నుండి వచ్చినవారే. కాని ఈ నిజాన్ని అంగీకరించక రాష్ట్రప్రభుత్వాలు స్థానిక నాయకత్వాలని కించపరుస్తున్నాయి.


సావిత్రీబాయి పూలే


కమలానెహ్రూ


విజయలక్ష్మి పండిట్


పద్మజా నాయుడు

## రాజకీయాల్లో మహిళల నాయకత్వం

73, 74 వ రాజ్యాంగ సవరణల పుణ్యమాని పంచాయతీలలో, మున్సిపాలిటీలలో 33 శాతం రిజర్వేషన్లు మహిళలకు దక్కాయి. (ఇటీవలే కేంద్రప్రభుత్వం ఈ రిజర్వేషన్లని 50శాతానికి పెంచింది.) మహిళల విషయంలో కూడా ఈ వర్గాలు తప్పుడు వాదనే చేస్తున్నాయి. వంటింటికి పరిమితమయ్యే మహిళలు ఊళ్ళేలాలా.. ఉద్యోగం చేయాలా అని ఎద్దేవా చేస్తున్నాయి. రిజర్వేషన్లు ఉన్నాయి గనుక ఆ పూటకి ఆ నాయకుడి తల్లినో, చెల్లినో, భార్యనో, వాళ్ళు దొరకకపోతే దూరపుబంధువునో పెట్టి ఎన్నికల్లో గెలిపించుకుంటున్నారు. ఆ తరువాత రిజర్వేషన్ మారిపోగానే ఆమె వంటింటికే పరిమితమవుతుంది. లేకపోతే అంతకుముందు చేస్తున్న కూలో, నాలో చేయాల్సి వస్తుంది. అంతే తప్ప రిజర్వేషన్ మారినా ఆ సీట్లో మళ్ళీ మహిళను గెలిపించాలన్న స్పృహ రాజకీయాల్లో కొరవడింది. కాని వంటింటిని, సంసారాన్ని నడిపే స్త్రీ ప్రజాప్రతినిధిగా ఎన్నికైతే ఆమె సామర్థ్యం విస్తృతమవుతుంది. ఇంట్లో బడ్జెట్ ఎలాగో ఆమె ఎన్నికైన గ్రామానికి కూడా అదేరకంగా బడ్జెట్‌ను పొదుపుగా వాడుతుంది. ఇంట్లో మంచినీటి కష్టం ఎలాగో ఊళ్ళో కూడా ఆ కష్టాన్ని తీర్చాలనుకుంటుంది. తన పిల్లల చదువు, ఆరోగ్యం పట్ల ఏ రకమైన బాధ్యత, శ్రద్ధ వుంటుందో అదే రకమైన బాధ్యతను గ్రామంలోని స్కూలు గురించి చూపిస్తుంది. ఆరోగ్యకేంద్రాన్ని బాగుచేస్తుంది. తన కష్టం తన అనుభవం నుండి సమాజపరమైన ఆలోచన చేస్తుంది. కాని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల గురించి మాట్లాడితే అన్నీ పార్టీలు ఒక్కటై 20 ఏళ్ళుగా మహిళా రిజర్వేషన్ల బిల్లును ఆటక ఎక్కిస్తున్నాయి. సమాజంలో సగమైన మహిళలను చట్టసభల్లో మాత్రం దరిచేరనివ్వడం లేదు. జాతీయోద్యమంలో మహిళల పాత్ర కూడా తక్కువేమీ కాదు. ఒక ఝాన్సీలక్ష్మిబాయి, కస్తూర్బా గాంధీ, కమలానెహ్రూ, సరోజిని నాయుడు, విజయలక్ష్మి పండిట్, సుచేతాకృపలాని, పద్మజానాయుడు, ఇందిరాగాంధీ, అరుణాఅసఫ్ అలీ లాంటి వనితలు ఎంతో మంది జాతీయ నాయకులుగా ఎదిగారు. అందుకే స్థానిక ప్రభుత్వాలలో ఇటు గ్రామీణ నాయకత్వాన్ని, మహిళలని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పదవికోసం అప్పటికప్పుడు తయారు చేయబడే నాయకత్వం కంటే సమాజంలో, రాజకీయాల్లో, పార్టీల్లో కిందిస్థాయి నుండి ఎదిగే సహజ నాయకత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం నేటి రాజకీయాలకి, పార్టీలకి వుంది. ఆ రోజు కోసం మనందరం కృషి చేయాలి. ◆


దుర్గాబాయి దేశ్‌ముఖ్


ఇందిరాగాంధీ


అరుణ్ అసఫ్ అలీ


సుచేత కృపలానీ

కవిత

# నేటి రాజకీయం

## రాజకీయం భలే లాభదాయక వ్యాపారం

- చాడా మునిశేఖర్ రెడ్డి

రా ☞ రాజకీయమంటే

జ ☞ జనాలకు వాగ్దానాల మీద వాగ్దానాలు చేస్తూ

కీ ☞ కీలెరిగి వాత పెట్టినట్లు మందు, మనీలతో ఓట్లను కొట్టేస్తూ

యం ☞ యంకమ్మను పట్టుకొని పోలింగ్ తేది దగ్గర పడేముందు వెంకటలక్ష్మీ దేవమ్మ అని సంభోదిస్తూ

భ ☞ భజన పరులతో నిత్యం వివిధ ఛానల్స్‌లో భజన చేయించుకొంటూ

లే ☞ లేమితో నిరంతరం పోరాడుతున్న ముసలిదాని చేతి ముద్దలు తింటున్న ఫోజులు కొడ్తూ

లా ☞ లా ముందు నేను, నీవు, మీరు అందరూ సమానమే అని పైకి చెప్తూ

భ ☞ భవిషత్తులో బ్రహ్మాండం చేయబోతున్నట్లు భ్రమలను కలిగిస్తూ

దా ☞ దారిన పోయే దానయ్యలకు చలివేంద్రలు పెట్టి నీరు పోసే ఫోజులు కొడ్తూ

య ☞ యప్పటకయ్యేది ప్రస్తుత మప్పటికా మాటలు తియ్యగా మాట్లాడుతూ

క ☞ కల్లాకపటం ఎరుగని మిస్టర్ క్లీన్ లాగా అద్భుతంగా అభినయస్తూ

వ్యా ☞ వ్యాధి గ్రస్తులకు సేవలు చేస్తున్నట్లు చేసి పోటోలుదిగుతూ

పా ☞ పారిశుధ్యంలో పదినిమిషాలు పాల్గొని పదిఛానళ్ళకీ వార్తలు పంపుతూ

రం ☞ రంగ రంగ వైభవ జీవనానికి కావాల్సిన సిరిసంపదలను సంపాదించుకోవడమే.

# నిజమైన రాజకీయం

రాజకీయమంటే సేవ - బాధ్యత

ఓటు మాకు అధికారం మీకు అనేది

ప్రజలే ప్రభువులు - పాలకులు సేవకులే అని చాటి చెప్పేది

పుట్టుకతో వివక్షతను తొలగించేది

ప్రజల మధ్య విభేదాలు పెంచకుండా ఐక్యం చేసేది

ప్రజల అపారమైన ఆకాంక్షలకి - పరిమితమైన వనరులకి వారధి కట్టేది

విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పించేది

ప్రజల మధ్య సమూహాల మధ్య వైరుధ్యాన్ని తగ్గించేది

# లాభసాటి వ్యవసాయానికి అనుకూల విధానాలు తెస్తారా? రైతులను బలిపెడతారా?

- డా॥ పి. భాస్కరరావు
కార్యదర్శి, స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య

రైతు జన భాంధావులమన్న భుజకీర్తులు తగిలించుకుంటూనే రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయాన్ని పెను సంక్షోభంలోకి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నెట్టేసాయి. వచ్చే పదేళ్ళలో దేశ అవసరాల మేరకు అదనంగా 5 కోట్ల టన్నుల ఆహార దిగుబడులు సాధించాల్సి వుందని వేదికలెక్కి ఉద్భోదించే నాయకులు సతత హరిత విప్లవాన్ని ప్రస్తావిస్తూ వుంటారు. మరోవంక ప్రభుత్వమే ఆర్థికంగా రైతును కుంగదీసే విధానాలను అవలంభిస్తున్నది.



స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో ఏప్రిల్ 11, 2012 న అభ్యుదయ రైతుల సదస్సులో ప్రసంగిస్తున్న శ్రీ గుణవంతరావు పాటిల్ ఉపాధ్యక్షులు షేత్‌కారి సంఘటన మహారాష్ట్ర

పాలు, పాల ఉత్పత్తులు ప్రత్తి, చెక్కెర ఎగుమతులపై ఆంక్షలు విధిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం రైతుల్ని దారుణంగా దెబ్బతీస్తుందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి తీవ్రంగా ఆక్షేపించారు. చక్కెర ఎగుమతులపై ఆహారమంత్రిత్వశాఖ పెదధోరణి కారణంగా భారీగా నష్ట పోవాల్సివచ్చిందని ఎగుమతులు సజావుగా సాగివుంటే చెరుకు రైతులకు చెల్లించాల్సిన 8 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించే వీలుండేదని ప్రధానికి లేఖ రాసారు. ఇటీవల పత్తి ఎగుమతుల నిషేధంపై జౌళి మంత్రిత్వశాఖ నిర్ణయమూ రైతుల కడుపు కొట్టిందన్న పవార్ మాటలు అక్షర సత్యాలు. కేంద్రం ప్రకటించే కనీస మద్ధతు ధర రైతు శ్రమకు సరైన ప్రతిఫలం కాదంటూ వ్యవసాయ ఉత్పత్తులకు లాభసాటి ధర దక్కాలంటే స్వేచ్ఛా వాణిజ్య విధానాన్ని అవలంభించాలన్నది వ్యవసాయ మంత్రి సూచన. ఆర్థిక సంస్కరణల పేరిట వ్యవసాయ రంగంలో సబ్సిడీల భారం వదిలించుకుంటున్న కేంద్ర ప్రభుత్వం రైతుకు లాభసాటి ధర లివ్వకుండా దిగబట్టడం కంటే అమానుషత్వం ఏమైనా ఉందా!

ప్రతి సంవత్సరం వేల మంది రైతుల బలవన్మరణాలతో వ్యవసాయరంగం సంక్షోభంలో ఉన్నందున ప్రభుత్వాలు లాభసాటి వ్యవసాయానికి అనుకూల విధానాలు అమలుకు స్వామినాధన్ కమీషన్ సూచనలు వెంటనే అమలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

పంట ఏదన్నా దానితో నిమిత్తం లేకుండా 'కొనబోతే కొరివి అమ్మబోతే అడవి' అనే చందంగా పరిస్థితులు వికటించి బడుగు రైతులు బావురుమంటున్నారు. ధాన్యం పండించే రైతు కంట ధైన్యం గూడుకట్టుకుంటే పసుపు, పత్తి, చెరుకు ఇలా ఏ పంట రైతు ఇంట సంతోషాన్ని నింపింది లేదు. నష్టదాయక సేద్యం చేయలేమంటూ రైతులు కాడి వదిలేస్తున్నా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చీమ కుట్టినట్టయినా ఉండడం లేదు.

ఏ పంట పండించినప్పటికీ అంతిమంగా రైతు నష్ట పోకూడదన్నదే పలు దేశాల సంవిధాన సూత్రం. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా దేశం 2011-12 లో దాదాపు 60 వేల కోట్లు ఆర్జించినా అంతిమ లబ్ధిదారు రైతేనా అన్న ప్రశ్నకు సూటిగా సమాధానం రాదు. దళారుల కోసమో, మిల్లర్ల కోసమో పరిశ్రమాధిపతుల కోసమో రైతు ప్రయోజనాల్ని బలిపెట్టే విధానాలు అమలులో వున్నాయి.



స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో ఏప్రిల్ 11, 2012 న అభ్యుదయ రైతుల సదస్సులో పాల్గొన్న రైతులు

వ్యవసాయరంగం బలోపేతానికి స్వామినాధన్ కమిటీ దేశానికి 'వ్యవసాయమే ఆయువుపట్టు' అయినందున జాతీయ రైతు విధానమే కావాలని సిఫార్సు చేయటం జరిగింది. రైతు కుటుంబాలు చిందించే స్వేదానికి ఎలా విలువకట్టి లాభసాటి ధర కల్పించాలో తన నివేదికలోనే విపులీకరించారు. రైతులకు లాభసాటి ధర అందిస్తే మార్కెట్‌లో నిత్యావసరల ధరలకు రెక్కలు వస్తాయన్న వితండవాదంతో రైతుల పొట్టలు కొట్టేందుకు కేంద్ర రాష్ట్ర సర్కార్లు సిద్ధపడుతున్నాయి. సమీకృత అభివృద్ధికి బాటలు పరవాలని 4 ఏళ్ళ క్రితం స్వామినాధన్ సూచిస్తే కేంద్రం ఉలుకూ పలుకూ లేకుండా ఊరుకుంది. వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలు పలు శాఖల పరిధిలోకి వెళ్ళిపోయి విధానాల అమలు యంత్రాంగం కుప్పకూలిందనేమాట అక్షరసత్యమని తాజాగా శరద్‌పవార్ లేఖాస్త్రమే చాటుతుంది. భారత వ్యవసాయరంగం తెరిపిన పడాలంటే 1. వాణిజ్యం పై నియంత్రణ తొలగించటం. 2. బియ్యం, గోధుమ, చక్కెర, పత్తి ఎగుమతులకు అవకాశం కల్పించటం 3. రాష్ట్రస్థాయిలో ధరల నిర్ణాయక సంఘాలు ఏర్పాటు చేయటం 4. దేశం లోపల, వెలుపల ఎక్కడైనా పంట ఉత్పత్తులను అమ్ముకునే స్వేచ్ఛ ఇవ్వటం

వ్యవసాయంలో తక్షణ దీర్ఘకాలిక చర్యలు కేవలం రైతులకు కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బాగుచేసేందుకు అవసరమయిన జాతివిధానాన్ని ప్రకటించాలి. వ్యవసాయం అనుబంధ కార్యకలాపాల్లో వున్నవారి (జనాభాలో 65 శాతం) తలసరి ఆదాయం రూ॥ 15000/- వుంటే వ్యవసాయేతర రంగాలలో వున్న 35 శాతం జనాభా తలసరి ఆదాయం 1లక్షా 5000 వుంది. ఇవే విధానాలను కొనసాగిస్తే ఇప్పుడు 7 రెట్లుగా వున్న ఆ అంతరం 2020 నాటికి 15 రెట్లకు పెరుగుతుందని అంచనా. అటువంటి తీవ్రస్థాయి అంతరం వల్ల సామాజిక కల్లోలం, రాజకీయ అస్థిరత, ఆర్థికమాన్యం తలెత్తే అవకాశం వుంది. ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాలకు భిన్నంగా వ్యవసాయం పై ప్రభుత్వం తన భల్లూకపు సంకెళ్ళను కొనసాగించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

జాతీయ వ్యవసాయ విధానంతోపాటు చదువుకున్న యువత వ్యవసాయం పట్ల మక్కువ చూపించడానికి దేశ రాష్ట్రస్థాయిలో అనేక చర్యలు తీసుకొనవలసిన అవసరం ఉంది.

**ముఖ్యంగా రాష్ట్రస్థాయిలో**

1. జాతీయ గ్రామీణ హామీ ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం
2. విస్తృతంగా యాంత్రీకరణ
3. రైతు సిరి అగ్రిక్లినిక్‌ల ద్వారా మంచి విత్తనాలు, ఎరువులు, సాంకేతిక సలహాలు, భూసార పరీక్షలు, రైతు వేసే పంటల నమోదు, ఆన్‌లైన్‌లో సాంకేతిక సలహాలు
4. వ్యవసాయ యంత్రాలపై పూర్తిగా పన్నులు ఎత్తివేత.
5. రైతు ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆధునికరించిన మార్కెట్ యార్డులు.
6. మార్కెట్ యార్డు నందు వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునే గోడన్ల ఏర్పాటు
7. రిటైల్ ఛైన్లు సూపర్ మార్కెట్‌లకు వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకునే ఏర్పాటు
8. అగ్రోప్రాసెసింగ్ పరిశ్రమలు
9. కోల్డ్ స్టోరేజీలు
10. రైతులు, కౌలు రైతులకు సులభపద్ధతిలో వ్యవసాయ రుణాలు
11. వ్యవసాయానికి అనుబంధంగా గేదెలు, కోళ్ళు, చేపలు, గొర్రెలు మొదలైన యూనిట్ల ఏర్పాటుకు రుణాలు
12. వ్యవసాయ ఉత్పత్తులకు సరైన ధరలు లభించనప్పుడు ప్రభుత్వంపరంగా మార్కెట్ ఇంట్రవెన్షన్ కొరకు మార్క్‌ఫెడ్, అగ్రోస్ మొదలైన సంస్థల ద్వారా కొనుగోలుకు ఏర్పాట్లు.

పై చర్యల ద్వారా రైతులకు అనుకూల విధానాలు అవలంభించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేయవలసిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదే. ◆

# 610 జీవో అమలు చేయాల్సిందే

## - జీవోను సమర్థించిన ట్రైబ్యునల్

## - నిలుపుదల ఉత్తర్వులను తొలగిస్తూ తీర్పు

స్థానికేతర ఉద్యోగులను సంబంధిత జోన్లకు వెనక్కు పంపడానికి ఉద్దేశించిన 610 జీవోను రాష్ట్ర పరిపాలన ట్రైబ్యునల్ సమర్థించింది. దీని అమలును నిలిపేస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తొలగించింది. రాష్ట్రపతి ఉత్తర్వులలోని (ప్రెసిడెన్షియల్ ఆర్డర్) నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగ నియామకాలు జరిగాయంటూ తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం చేసిన విన్నపం మేరకు ప్రభుత్వం 1985 డిసెంబరు 30న రాష్ట్ర ప్రభుత్వం 610 జీవో జారీ చేసింది. ఆ తర్వాత ఉల్లంఘనలు సవరిస్తూ 2007 సెప్టెంబరు 7న 674 జీవో జారీ అయ్యింది. వీటి ప్రకారం నిర్దేశించిన కోటా కంటే ఎక్కువగా ఉన్న స్థానికేతర ఉద్యోగులను సంబంధిత జోన్ లేదా కేడర్‌కు తిరిగి పంపడానికి శాఖల వారీగా అంతర్గత ఉత్తర్వులు విడుదలయ్యాయి. తద్వారా స్థానికేతర ఉద్యోగులు సుమారు 18 వేల మందిని సంబంధిత జోన్లకు తిరిగి పంపాల్సి ఉంది. 610, 674 జీవోలను సవాల్ చేస్తూ సుమారు 3500 పిటిషన్లు ఏపీ పరిపాలనా ట్రైబ్యునల్‌లో దాఖలయ్యాయి. పిటిషనర్ల అభ్యర్థన మేరకు బదిలీలను నిలిపివేస్తూ ట్రైబ్యునల్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పిటిషన్లపై తుది విచారణ చేపట్టిన ఛైర్మన్ జస్టిస్ జి.యతిరాజులు, జ్యుడీషియల్ సభ్యుడు సుధీందర్ కులకర్ణి, పరిపాలన సభ్యుడు దీపక్ కుమార్ పన్వర్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. రాష్ట్రపతి ఉత్తర్వుల నిబంధనలకు 610,674 జీవోలు ఏ విధంగానూ విరుద్ధంగా లేవని స్పష్టం చేసింది. నోటీసులు ఇవ్వకుండా బదిలీ చేయడం సహజన్యాయ సూత్రాలకు విరుద్ధమన్న పిటిషనర్ల వాదనతో ధర్మాసనం ఏకీభవించలేదు. ఏపీపీఎస్సీ లేదా ఇతర నియామక సంస్థలు ఉద్యోగులకు నిర్దేశించిన పదోన్నతి ర్యాంకులతో 610 జీవో ద్వారా బదిలీ అయిన వారికి ముడి పెట్టజాలమని స్పష్టం చేసింది. పదోన్నతి అనేది చట్టబద్ధమైన హక్కేమీ కాదని పేర్కొంది. రాష్ట్రపతి ఉత్తర్వుల్లోని నిబంధనలకు లోబడే జీవోలు జారీ చేశామని, వీటిని తొలగించాలని అభ్యర్థిస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన వేకేట్ పిటిషన్లను ధర్మాసనం అనుమతించింది. గతంలో 610 జీవో అమలును నిలిపేస్తూ జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను తొలగించింది.

### స్థానికేతరులను పంపే యోచన

ట్రైబ్యునల్ ఆదేశాల నేపథ్యంలో స్టేలపై కొనసాగుతున్న వారిని స్వస్థలాలకు పంపించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. 1985 డిసెంబరు 30న జారీ అయిన 610 ఉత్తర్వు ప్రకారం 1986 జూన్ నాటికి స్థానికేతరులందరినీ స్వస్థలాలకు పంపించాలి. అది జరగలేదు. దీనిపై 2006లో భారీఎత్తున ఆందోళనలు జరిగాయి. అప్పటి సీఎం రాజశేఖరరెడ్డి 2006 డిసెంబరు 12న ప్రకటన చేస్తూ 2007 జూన్ నెలాఖరు నాటికి ఈ జీవో అమలు ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. తర్వాత స్థానికేతరుల గుర్తింపు, బదిలీల ప్రక్రియ ప్రభుత్వం చేపట్టింది. 2007 జూన్ వరకు జీవో పూర్తిస్థాయిలో అమలు కాలేదు. గడువును పొడగిస్తూ, చివరికి గడువులేకుండానే దీనిని అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఉద్యోగ సంఘాలు లక్ష మంది స్థానికేతరులున్నారని ప్రకటించగా, ప్రభుత్వం మాత్రం 18,661 మందినే స్థానికేతరులను గుర్తించింది. ఇందులో ఎక్కువ మంది ఉపాధ్యాయులు, పోలీసులే. భార్య లేదా భర్త స్థానికులైన వారికి ఈ జీవోను మినహాయించారు. అత్యవసర శాఖల్లోనూ అవసరాల దృష్ట్యా 610 జీవోను అమలు చేయలేదు. చివరికి 10,417 మందికి బదిలీ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 5800 మంది తెలంగాణ జిల్లాల వారే. 5,6 జోన్ల పరిధిలో కొనసాగుతున్న వారిని ఇతర తెలంగాణ జిల్లాలకు బదిలీ చేసింది. 610 జీవో కింద బదిలీల వల్ల ఖాళీ అయిన స్థానాలను భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా అమలు చేయలేదు. బదిలీ చేసిన వారిలో 3500 మంది ట్రైబ్యునల్‌ను ఆశ్రయించి స్టేలు పొందారు. నాలుగేళ్ల తర్వాత తాజాగా ట్రైబ్యునల్ తీర్పుతో అవి తొలగిపోయాయి. ◆

# బినామీల సునామీ!

## రెచ్చిపోతున్న 'ముసుగు' దొంగలు



**మాడభూషి శ్రీధర్**
(రచయిత నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్)

***రాష్ట్రంలో రాజకీయమంతా ఇప్పుడు బినామీల చుట్టూ తిరుగుతోంది. తినడానికి తిండి, ఉండటానికి గూడులేక తెల్లరేషన్ కార్డు మీద ఆధారపడి రూపాయికి కిలో బియ్యం తెచ్చుకుంటున్న సామాన్యులు రాష్ట్రంలో మద్యం దుకాణాలకు సొంతదారులంటే నమ్ముతారా? దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బడుగుజీవులు మద్యాన్ని విచ్చలవిడిగా పారించే క్రమంలో- రాజకీయ నాయకులకు, పోలీసులకు, ప్రభుత్వాధికారులకు, చివరకు కొందరు మీడియావారికీ లక్షల రూపాయల లంచాలు ముట్టజెబుతున్నారంటే విశ్వసించసాధ్యమా? అవినీతి నిరోధక శాఖ పరిశోధనల సాక్షిగా ఇదంతా పచ్చి నిజం! మద్యం అక్రమ వ్యాపార విజృంభణపై అవినీతి నిరోధక శాఖ నివేదికను పరిశీలించిన హైకోర్టు నివ్వెరపోయింది. ప్రజలూ నిర్ఘాంతపోతున్నారు. ఈ వ్యవహారాలన్నీ బినామీలకు తెలియదు. ఒకవేళ అనర్హుల తెల్లకార్డులు తొలగించాలని సర్కారు నిర్ణయిస్తే- పాపం ఈ 'బినామీ' లందరికీ తాగడానికి మందు సంగతి దేవుడేరుగు... కనీసం రేషన్ తిండి తినే అవకాశమూ కరవవుతుంది.***

### మహా మాయాజాలం

బినామీల గుట్టు రట్టు చేయాలని అవినీతి నిరోధక శాఖను; తెల్లకార్డుదారుల పేరిట ఏ ప్రాతిపదికను పెద్ద మొత్తాలను జమచేశారో నిగ్గుతేల్చాలనీ ఆదాయపు పన్ను శాఖను హైకోర్టు ఆదేశించింది. రాష్ట్ర వ్యాప్తంగా బినామీ మద్యం దుకాణాలు ఉన్నాయి. విజయనగరంలో 57శాతం, శ్రీకాకుళంలో 61శాతం మద్యం దుకాణాల లైసెన్సులు తెల్లకార్డుదారుల పేరిట ఉన్నాయని ఏసీబీ వివరించింది. విజయనగరంలో 31 మద్యం దుకాణాలు తన బంధువులవేనని పీసీసీ అధ్యక్షుడు, మంత్రి బొత్స సత్యనారాయణ స్వయంగా ప్రకటించారు. ఈ ఒక్క జిల్లాలోనే అక్రమ వ్యాపారులు రూ॥3.8కోట్ల లంచాలను మంత్రులకు, పోలీసులకు, అధికారులకు, కొందరు పాత్రికేయులకు ఇచ్చినట్లు ఏసీబీ నివేదికలో ఉంది. బినామీ వ్యవహారాల అంతు తేల్చేదాకా అవినీతి సొమ్ము రాజ్యం చేస్తూనే ఉంటుంది. బినామీకి ఆస్కారంలేని పరిస్థితి రావాలంటే అందుకు వీలు కల్పించే చట్ట పరమైన ప్రాతిపదిక ఉండాలి. విచారణ యంత్రాంగం ఏర్పడాలి. నేరానికి తగిన శిక్షలు, ఆస్తుల స్వాధీనం ఎప్పటికప్పుడు జరిగి తీరాలి. ఇప్పుడు అలాంటివి లేవు. ఆస్తి ఎవరిపేరున ఉంటే అది వారిదే అవుతుంది. ఒకరి పేరిట ఆస్తి 'రిజిస్టర్' అయిన తరవాత- ఆ ఆస్తి సంపాదించడానికి తానే డబ్బు సమకూర్చానని ఇంకెవరైనా వాదిస్తే, చట్టం అలాంటి వాదనకు ఏ రకమైన విలువా ఇవ్వదు. అలాంటి వివాదాలను కోర్టులు విచారణకు స్వీకరించవు. ఇది సర్వసామాన్యమైన ఆస్తి బదిలీ న్యాయ నియమం. సదరు ఆస్తి ఎవరికి చెందినది అని రిజిస్ట్రేషన్ ద్వారా చాటిచెబుతారో- ఆ వ్యక్తికే ఆ ఆస్తిపై సర్వాధికారాలు ఉంటాయి. ఇది మౌలిక సూత్రం. అవినీతి సొమ్ముకు బినామీ ఒక ముసుగుగా మారింది. ఫలితంగా నల్లడబ్బు చలామణీకి మార్గం సుగమమైంది. ఈ నేపథ్యంలో సర్వసామాన్యంగా అమల్లో ఉన్న నియమాలతోపాటు- నేర నియమాలను శిక్షలను, స్వాధీన నిబంధనలనూ జోడించాల్సిన అవసరం వచ్చింది. బినామీ నిషేధ నిబంధనలను మరింత విస్తరించి- మరొకరి పేరిట ఆస్తి ఉంచితే ఆ బినామీదారుకే సదరు ఆస్తి దఖలు పడుతుందని చట్టాలు చేయాల్సి వచ్చింది. అలా చేయడం నేరమని కూడా నిర్ధారించాల్సి వచ్చింది.

### 'బినామీ' అంటే

**'బినామీ'అన్నది పర్షియన్ పదం.** ఎవరి పేరునా లేని ఆస్తి అని దీని అర్థం. నల్లడబ్బు దాచుకొనేందుకు

పెద్దతలకాయలు చాలావరకు బినామీలను సురక్షి మార్గంగా ఉపయోగించుకుంటున్నాయి. భూసంస్కరణలు అమల్లోకి తీసుకువచ్చి నప్పుడు- మిగులు భూమి ప్రభుత్వపరం కాకుండా ఉండేందుకు పెద్ద పెద్ద భూస్వాములంతా తమ భూములను ఇది వరకే ఎవరెవరికో విక్రయించినట్లు దస్తావేజులు సృష్టించి మోసం చేశారు. దస్తావేజులు ఆ భూస్వాముల దగ్గరే ఉండటంవల్ల ఎవరి పేరున ఎంత ఆస్తి ఉందో బినామీదారులకు తెలిసే అవకాశమే లేకుండా పోయింది. ఈ బినామీ వ్యవహారాలను నిషేధిస్తూ- ఆస్తి ఎవరిపేరిట ఉందో...వారికే సదరు ఆస్తి చెందుతుందని చట్టం తీసుకువచ్చారు. ఇతరుల పేరిట రిజస్టర్ అయిన ఆస్తికి మూలం తమ సొమ్మే అని ఎవరూ చెప్పు కోవడానికిగానీ, రుజువు చేయడానికిగానీ వీల్లేకుండా 1988లో బినామీ నిషేధ చట్టం తీసుకువచ్చారు. కానీ, ఆ చట్టంలో చాలా లోపాలున్నాయి. ఫలితంగా కనీసం ఆ చట్టం కింద నిబంధనలను రూపొందించడమూ సాధ్యం కాలేదు. చివరకు అది కాగితాలకే పరిమితమైంది. దాన్ని ఎవరూ అమలు చేసిన పాపాన పోలేదు. ఆ చట్టం అమల్లోకి వస్తే తమ పేరిట ఆస్తులు ఉన్నాయని తెలిసిన బినామీ పేదలు వాటిని సంపన్నులనుంచి లాక్కుంటారని- ఆక్రమంలో అవసరమైతే కోర్టులకూ ఎక్కుతారని ప్రభుత్వం భావించి ఉంటుంది. ఆ చట్టం 23 ఏళ్లుగా అటక మీదే ఉంది. అవినీతిని నిరోధించే క్రమంలో ఈ చట్టం ఏ మాత్రం విలువలేనిదిగా మిగిలిపోయింది. ఈ తరహా అమలుకాని చట్టాల కారణంగా ప్రజలకు వాటిమీదే నమ్మకం పోతుంది.



## బినామీ బిల్లు 2011

ఐక్య ప్రగతిశీల కూటమి సర్కారు రెండోదశలో అవినీతి కొత్తపుంతలు తొక్కింది. వివిధ కేసుల్లో యూపీఏ ఏలికలకు సర్వోన్నత న్యాయస్థానం మొట్టికాయలు వేసింది. అన్ని వైపులనుంచీ ఎదురుదాడి మొదలవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో సర్కారు- నూతన బినామీ బిల్లును 2011 జూన్‌లో క్యాబినెట్ ఆమోదించింది. అవినీతిపై పోరాటంలో తానూ చెప్పుకోదగిన స్థాయిలోనే ప్రయత్నిస్తున్నట్లు కనిపించే ప్రయత్నం చేసింది. ఆ రకంగా పరువు కాపాడుకునేందుకు ఉద్యుక్తమైంది. ఆ బిల్లును ఆగస్టు 18న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. భార్య, భర్త, సోదరి, సోదరుడు, కొడుకులు, బిడ్డలు, మనుమల పేరిట తప్ప మరెవరి పేరున ఆస్తులు, డబ్బు జమచేయరాదన్న నిబంధనలతో నూతన బినామీ నిషేధ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

## బినామీ నిర్వచనం

**ఒకరి డబ్బుతో కొన్న ఆస్తిని మరొకరి పేరిట రిజిస్టర్ చేయడం, ఒకరి తరపున మరొకరు ఆస్తిని కలిగి ఉండటం లేదా కల్పితమైన పేరు మీద ఆస్తి నమోదు చేయడం, ఎవరి పేరున ఆస్తి ఉందో ఆ వ్యక్తి ఆ ఆస్తికి సొంతదారుడిని తానే అన్న విషయం తెలియకపోవడం బినామీ అని నిర్వచించారు.** కుటుంబంలోని రక్తసంబంధీకులు కాకుండా మరెవరి పేరిటైనా ఆస్తి పాస్తులను రిజిస్టర్ చేస్తే- ఎవరికీ ఏ విధమైన నష్టపరిహారమూ చెల్లించకుండా ఆ ఆస్తిని జప్తుచేసే అధికారం ఈ బిల్లు ప్రభుత్వానికి దఖలు పరుస్తోంది. ఈ క్రమంలో- హిందూ సమష్టి కుటుంబ ఆస్తులకు, ధర్మాదాయ ఆస్తులకు మినహాయింపు ఇచ్చారు. 1988నాటి బినామీ నిషేధ చట్టంలో

బినామీ ఆస్తిని స్వాధీనం చేసుకునే నిబంధనే లేదు. బినామీ ఆస్తులను స్వాధీనం చేసుకునే అధికారం లేకపోతే ఈ చట్టంవల్ల ఉపయోగమే లేదని, అవినీతిని రుజువు చేసిన తరవాత దోపిడికి గురైన జనం సొమ్మును తిరిగి ఖజానాకు చేర్చే అధికారం ప్రభుత్వ యంత్రాంగానికి లేకపోవడం ఆ చట్టంలోని అతిపెద్ద లోపమని కేంద్ర నిఘా సంఘం (సీవీసీ) ఎన్నోసార్లు వాదించింది. లంచాలు తీసుకుని జైలుపాలైన రాజకీయ నాయకులు, అవినీతి అధికారులు జైలుశిక్ష తరవాత బయటకు వచ్చి ఆ ఆస్తులను అనుభవిస్తుంటే- ఏమీ చేయలేని దుస్థితి మన ప్రభుత్వానిది!

## ఆస్తి స్వాధీనమే కీలకం

బినామీ వ్యవహారాన్ని నిషేధించి ఆ ఆస్తి పాస్తులపై క్రయవిక్రయాలకు అవకాశం లేకుండా చేసినప్పటికీ- స్వాధీన నిబంధన లేకపోతే ఆ చట్టాలు కొరగానివే అవుతాయి. అలాంటి ఆస్తులను సర్కారు స్వాధీనం చేసుకునేందుకు అనువైన నిబంధనలను నూతన బినామీ వ్యవహారాల నిషేధ బిల్లు-2011లో చేర్చడం ప్రస్తావించుకోదగిన పెద్ద మార్పు. ఆస్తి ఎవరి పేరిట ఉందో వారిని బినామీ అనీ- దాని ప్రయోజనం ఎవరిదో అతడిని 'లాభోక్త' అని అంటారు. బినామీనుంచి 'లాభోక్త'కు ఆస్తి బదిలీని కొత్త బిల్లు నిషేధిస్తోంది. ఇలాంటి ఆస్తులన్నీ కేంద్రసర్కారుకే చెందుతాయని స్పష్టమైన నిబంధన రూపొందించారు. ఆస్తుల స్వాధీనానికి అనువుగా పకడ్బందీ నిబంధనలు రూపొందించారు. బినామీ ఆస్తిపాస్తుల వివాదాల విచారణకు ఓ యంత్రాంగాన్నీ ఏర్పాటు చేశారు. అవినీతి నిరోధక కార్యక్రమానికి ఇది కొత్త జవసత్వాలు కల్పిస్తుందన్నదే అందరి ఆకాంక్ష. 'మనీ లాండరింగ్' చట్టం ప్రకారం 2002లో న్యాయనిర్ణాయక సంస్థ (ట్రైబ్యునల్) ఏర్పాటైంది. బినామీ నిషేధం చట్టం కిందా ఈ సంస్థ అథారిటీగా పనిచేస్తుంది. దీనిపై అప్పిలేట్ ట్రైబ్యునల్‌కు అప్పీలు చేసుకునే అవకాశం కల్పించారు. బినామీ నేరాన్ని నిర్వచించడం, బినామీ వ్యవహారాలు ఏమిటో వివరించడం, బినామీ ఆస్తుల స్వాధీనానికి తీసుకోవాల్సిన చర్యలు నిర్దేశించడం, నిబంధనలను ఉల్లంఘిస్తే కనీసం ఆరునెలల నుంచి రెండేళ్లదాకా జైలుశిక్షతోపాటు- ఆ ఆస్తి క్రయ విలువలో 25శాతం జరిమానా విధించడం వంటి కీలకాంశాలను కొత్త బిల్లు వివరిస్తోంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రతించి ప్రతి జిల్లాలో ఈ చట్టం కింద ఇలాంటి కేసులు విచారించేందుకు ఒక కోర్టును ఏర్పాటు చేయాలనీ ప్రతిపాదించారు. ఎవరెవరి పేరిటో ఇళ్ల స్థలాలు, పొలాలు, భవనాలను రిజిస్టర్ చేయించి- ఆ ఆస్తులనుంచి వచ్చే ఆదాయాన్ని మరెవో పెద్దతలకాయలు అనుభవించే విధానాన్ని నిలువరించే క్రమంలో ఇది మంచి ప్రయత్నమే. ఇదొక్కటే సరిపోదు ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న వ్యక్తి తన ఆస్తిపాస్తుల చిట్టాను ఏటా ప్రకటించాలన్న నిబంధన కచ్చితంగా అమలు చేయాలి. వారు ప్రకటించిన ఆస్తి కాకుండా ఇతరత్రా ఆస్తులు ఉన్నాయా అన్న విషయాన్ని పరిశీలించి- ఆ అదనపు ఆస్తులనూ స్వాధీనం చేసుకునే అధికారాన్ని ఈ 'చట్టం' ద్వారా కల్పించాలి. అక్రమ మార్గాల్లో ప్రభుత్వాన్ని మోసంచేసి కూడబెట్టుకున్న ఆస్తి పాస్తులను, జనం నుంచి దోచుకున్న అక్రమార్జనను లెక్కతేల్చేందుకు; అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13(1)ఇ కింద చట్టబద్ధంకాని ఆస్తులు ఉన్నాయా అన్న విషయాన్ని పరిశోధించి కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉండాలి. ఇలాంటివారి డబ్బును, ఆస్తిపాస్తులనూ స్వాధీనం చేసుకోవాలి. ఈ బిల్లుకు సత్వరం చట్టరూపం కల్పించాలి. ముఖ్యంగా మనరాష్ట్రంలో మద్య సామ్రాట్టుల బినామీ వ్యవహారాలపై దాన్ని ప్రయోగించి దర్యాప్తు జరిపించాలి. ఆయా దుకాణాలు ఎవరి పేరు ఉంటే, వాటిని వారికి అప్పగించాలి. అలాకాని పక్షంలో ఆ దుకాణాలను రద్దుచేసి, వాటి ఆదాయం ఎవరికి చేరిందో తేల్చాలి. ఆదాయం అందుకున్న వారిద్ద నుంచే ఆ డబ్బు వసూలు చేయాలి. అప్పుడు తప్ప బినామీలకు అడ్డుకట్ట పడదు. **ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే- ఈ చట్టాన్ని వెనక తేదీలనుంచి అమలు చేయాలి. ఇన్నాళ్లూ అక్రమాలు, కుంభకోణాలకు పాల్పడి- 'బినామీ సొమ్ము' తయారు చేసుకున్న వారికీ ఈ బినామీ నిషేధ చట్టాన్ని వర్తింపజేస్తే - నేతల అసలు రంగు బయటపడుతుంది! పన్ను ఎగవేసి పోగుచేసిన నల్లడబ్బును వెలికి తీయడం, స్విస్ బ్యాంకులకు తరలిన అక్రమార్జనలను బయటకు తేవడం మన సర్కారుకు చేత కాదని తెలుస్తూనే ఉంది. కనీసం దేశంలో పోగుబడుతున్న బినామీ సంపదనైనా స్వాధీనం చేసుకునేందుకు ఏలినవారు గట్టి ప్రయత్నం చేస్తే- అవినీతి కట్టడి దిశగా అదో ముందడుగు అవుతుంది.** ◆

(ఈనాడు సౌజన్యంతో...)

# సామాజిక అంతరాలకు కారణం

- జవహర్‌లాల్ నెహ్రూ
జనవరి 18, 1931

**భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ స్వాతంత్ర్యోద్యమ కాలంలో నైనిటాల్ జైల్లో వున్నారు. జైలు నుండి తన 1931 జనవరి 1నలో 'ద న్యూ ఇయర్ గిఫ్ట్' పేరుతో ఆయన రాసిన ఉత్తరాల పరంపర 1933 ఆగస్టు 9న రాసిన 196వ సాహిత్యం, కళలు, సాంఘిక దురాచారాలు ఇలా అనేక అంశాలను ఆ ఉత్తరాల్లో స్పృశించారు.**

**ఆదిమ సమాజం, మనిషి నిప్పును కనుక్కోవడం, వ్యవసాయాన్ని చేయడం సమాజ పరిణామ క్రమాన్ని ఆయన రాసిన 13వ ఉత్తరంలో వివరించారు. ఆహారాన్ని పండించే రైతు దుస్థితికి రాజకీయ దళారులే కారణమని ఆయన వివరించారు. పని సంస్కృతిని గౌరవించే రోజు రావాలని ఆయన ఆకాంక్షించారు. 80 ఏళ్ళ తరువాత కూడా నెహ్రూ రాసిన రాతలు రైతుల విషయంలో అక్షరసత్యాలు. రైతులు, కార్మికులు సమాజంలో ఎలా అణగదొక్కబడుతున్నారో, ఆర్థిక దోపిడీకి గురి అవుతున్నారో సోదాహరణంగా వివరించిన ఉత్తరాన్ని ప్రచురిస్తున్నాం.**

## ప్రియదర్శినీ...

మనిషి, అభివృద్ధి చెందుతున్నకొద్దీ వివిధ తరహా ప్రజలు ఏర్పడ్డారనే విషయాన్ని నేను నీకు ముస్సోరీకి రాసిన ఉత్తరాలో వివరించాను. ఆదిమానవుడికి ఆహారం దొరకడం కూడా కష్టంగా ఉండేది. జంతువులను వేటాడుతూ, కందమూలాలను, ఫలాలను పోగుచేస్తూ ఆదిమానవుడికి కేవలం తిండి సంపాదించుకోవడానికే ఎక్కువ కాలాన్ని ఖర్చు చేసేవాడు. రాను రాను జాతులు పెరిగాయి. ఒంటరిగా ఉండడం కంటే ఒక కుటుంబంగా ఉండడం లాభదాయకం అనే విషయాన్ని ఆదామానవుడు తెలుసుకున్నాడు.

అప్పుడు వ్యవసాయాన్ని కనుక్కునాడు. అది ఆదామానవుడి జీవితంలో పెద్ద మార్పు తీసుకువచ్చింది. వేటాడ్డం కంటే పండించుకోవడమే తేలిక అని ప్రజలు గ్రహించారు. ఆహారం కోసం ఎక్కడెక్కడో తిరగవల్సిన అవసరం కూడా లేకపోవడంతో మనుషులు పొలాల దగ్గరే నివసించేవారు. ఆ విధంగా గ్రామాలు తయారయాయి.

వ్యవసాయం మరికొన్ని మార్పులను కూడా తీసుకువచ్చింది. పండించిన పంట ఒకేసారి తినడానికి కాక, పెద్దమొత్తంగా ఉండడంతో మిగిలిన ఆహారాన్ని దాచుకునే పద్ధతికి మనిషి అలవాడు పడ్డాడు. ఇంతకు పూర్వం కంటే జీవితంలో సమస్యలు పెరగడం కూడా జరిగింది. కొంతమంది



శ్రమపడడమూ, కొందరు నిర్వహణ కార్యక్రమాలు చూసుకోవడం వంటి విభజన ప్రారంభమైంది. దాంతో నిర్వహణా కార్యక్రమాలు చూసేవారు. సాంఘికంగా బలవంతులుగా తయారయ్యారు. వీళ్లే తర్వాత్తర్వాత జమీందారులు, రాజులుగా రూపుదాల్చారు. వీళ్లు తమ అధికారాన్ని నిలుపుకోవడానికి ఆహారాన్ని ఎక్కువగా స్వంతం చేసుకోవడం మొదలు పెట్టారు. ఆ విధంగా వీళ్ళు

ధనవంతులుగా మారారు. పొలాలలో పనులు చేసేవారికి కేవలం వారికి సరిపోయే ఆహారం మాత్రమే లభించడంచేత వారు సామాన్యులుగానే మిగిలిపోయేవారు. రాను రాను వీళ్లు నిర్వహణ చేయడానికి కూడా బద్ధకించారు. వీళ్లు శ్రమజీవుల కష్టంలోంచి ఆహారాన్ని వాటాగా తీసుకోవడానికి మాత్రమే అలవాటు పడ్డారు. దాన్ని వారు తమ హక్కుగా భావించడం ప్రారంభించారు. ఇదంతా చదువుతుంటే వ్యవసాయం మనిషి జీవితాన్ని ఎంత మార్చివేసిందో తెలుస్తోంది కదూ!

ఆహారం ఇంతకు పూర్వంకన్నా తక్కువ కష్టంతో లభించడంతో మనిషికి తీరిక సమయం ఎక్కువ దొరికింది. దాంతో తెగలు పెరిగాయి. కొందరు ఇతర పనుల మీద కూడా తమ కాలాన్ని కేటాయించారు. ఆ విధంగా కొన్ని హస్తకళలు అభివృద్ధి చెందాయి. రకరకాల వృత్తులు వృద్ధి చెందాయి. కానీ అధికారం మాత్రం నిర్వహణ వర్గానికే మిగిలిపోయింది.

ఇక ముందు ముందు నువ్వు తెలుసుకోబోయే చరిత్రలో మనిషి ఆహారాన్ని తయారుచేసే కొత్త కొత్త మార్గాలను ఏ విధంగా కనుగొన్నదీ, తన అవసరాలను తీర్చుకునే మార్గాలను ఏవిధంగా ఏర్పాటు చేసుకున్నదీ తెలుసుకుంటావు. మనిషి ఆహారంతో సమానంగా ఇతర వస్తువుల అవసరాన్ని కూడా గుర్తించాడు. ఈ మార్పులన్నీ సంఘంలో మార్పులకు కారణాలయ్యాయి. ఆవిరి యంత్రాన్ని కనుక్కున్న తర్వాత, రైతు, ఓడలు కనుక్కోబడిన తరువాత ఆహార ఉత్పత్తుల విషయంలోను, శ్రమవిభజనలోనూ చాలా పెద్ద మార్పులు జరిగాయి. యంత్రాలు మనిషికంటే ఎంతో వేగంగా పనిచేయడం మొదలైంది.

ఆహారం తయారుచేయడంలో కొత్త కొత్త పద్ధతులు కనుక్కోబడడంతో ప్రపంచమంతా ధనికవర్గంగా తయారయే అవకాశం ఉందని అనుకుంటున్నావు కదా! నీ ఆలోచన సగం మాత్రమే నిజం. కొత్త కొత్త పద్ధతులు ప్రపంచాన్ని ఆర్థికంగా బలపరిచినమాట నిజమే. కానీ ఏ ప్రపంచాన్ని? మన దేశంలో బీదరికం ఉన్నమాట మనకు తెలుసు. ఐతే పేదరికం ఇంగ్లాండ్ వంటి ధనికదేశంలో కూడా ఎందుకు వుంది. ఇందులో వింతైన విషయం ఏమిటంటే **ఆహారం ఎంత ఉత్పత్తి ఐనప్పటికీ**



**పేదవారు పేదవారిగానే మిగిలిపోయారు. మరి ఈ ధనం అంతా ఎటుపోతోంది. ఎవరైతే నిర్వహణా కార్యక్రమాలు చూసేవారో వారికి ఈ ఉత్పత్తులలో పెద్ద మొత్తం చేరేది. ఈ విధంగా మనుషులలో పనిచేయకుండా ఆహారాన్ని స్వంతం చేసుకునే తరగతులు ఎక్కువయ్యాయి.** కొందరు పనిచేయడాన్ని తక్కువతనంగా భావించేవారు. ఇదీ ప్రపంచపరిస్థితి. రైతు, కార్మికుడు మాత్రం పేదరికంలోనే అలమటించేవాడు. మనం మన దేశస్వాతంత్ర్యం గురించి ఆలోచిస్తున్నాం. ఇటువంటి అన్యాయమైన పరిస్థితులు సంఘంలో పాతుకుపోయి ఉన్నప్పుడు ఏ దేశం మాత్రం స్వతంత్ర్యదేశంగా చెలామణి కాగలదు చెప్పు.

**మనిషికి జీవితాన్ని ప్రసాదించే ఆహారాన్ని తయారుచేసే మనుషులను, రైతులను హత్యచేసే మార్గాన్ని ఈ అధికార వర్గాలు కనుగొన్నాయి.** అన్న ఫ్రెంచ్ తత్వవేత్త వోల్టైర్ మాటలు నిజంగా నిజాలు. ఒకే కుటుంబంలోని మనుషుల మధ్య ఉండే బంధాలు పెరిగినప్పటికీ సంఘం అంతా ఒకే కుటుంబంగా భావించడం మాత్రం పెరగలేదు.

సంస్కృతి నాగరికతలను వివరించడం చాలా కష్టమైన పని. అయితే ఏ సంస్కృతిలోనైనా ఏ నాగరికతలోనైనా చాలా విషయాలు ఒకదానితో ఒకటి సంబంధం కలిగే ఉంటాయి. ఏ వ్యక్తికైనా తన తోటిమనిషి అవసరానికి ఉపయోగపడనట్లైతే అతడిని అనాగరికుడు అని అనాలి. ◆

**వ్యాసం సేకరణ :**

**సూదులగుంట్ల గోవిందరావు, నరసరావుపేట, గుంటూరు జిల్లా**

## మోగిన ఉప ఎన్నికల నగారా

# అవినీతి గురించి అందరూ నిజమే చెబుతున్నారు

- జ్వాల

***మహాభారతంలో కురుక్షేత్ర సంగ్రామానికి కురువంశ నాశనానికి 'కుట్రదారు' అయిన శకుని తన అల్లుళ్ళతో ఎప్పుడూ ఒక మాట అంటుంటాడు. 'అదియునూ సూనృతమే ఇదియునూ సూనృతమే' అని. రెండూ సూనృతమే అయినప్పుడు మరి ఏది అనృతము మామా అంటూ దుశ్శాసనుడు అమాయకంగా అడుగుతాడు. ఇద్దరూ చెప్పేది నిజమే అయినప్పుడు రెండూ 'సూనృతాలే' నిజం కాకపోతే కదా 'అనృతము' అంటాడు శకుని. మన రాష్ట్ర రాజకీయాలు చూస్తే అవినీతి విషయంలో అన్ని పార్టీలు చెప్పేది నిజమే అన్పిస్తుంది. నువ్వెంత తిన్నావంటే, నువ్వింత తిన్నావని లెక్కలు కడుతూ ప్రజలకి సాక్షాలు కూడా చూపెడుతున్నారు. అందుకే అన్ని పార్టీలు నిజమే చెబుతున్నాయి.***

మన రాష్ట్రంలో మొన్నటి ఉప ఎన్నికల్లో ఏడు స్థానాల్లో ఒకటి తప్ప (కోవూరు) మిగతా ఆరు స్థానాలు తెలంగాణ అంశమే ప్రధాన ప్రచార అంశంగా, ఎజెండాగా సాగాయి. మళ్ళీ 18 స్థానాలకు ఉప ఎన్నికల నగారా మోగింది. ఇందులో కూడా ఒకటి తప్ప (తిరుపతి ఎమ్మెల్యే చిరంజీవి రాజకీయ ప్రమోషన్ ? పై రాజ్యసభ సభ్యుడు కావడం వల్ల ఖాళీ అయింది.) మిగతావన్నీ దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి కొడుకైన జగన్ కోసం తమను గెలిపించిన కాంగ్రెస్ పార్టీని విడిచిపెట్టి రాజీనామా చేసినవే.



ఈ ఉప ఎన్నికల్లో జగన్‌తో సహా కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు కూడా అవినీతిని ప్రచార అస్త్రంగా చేసుకున్నాయి. విచిత్రమైన ఈ ఆటలో అన్ని పార్టీలు అవినీతి గురించే ఎక్కువగా మాట్లాడుతున్నాయి. దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా నీతివంతమైన పాలన మేమే అందిస్తామంటూ మూడు పార్టీలూ చెబుతున్నాయి. నేతిబీరకాయలో నెయ్యిలాగా రాజకీయాల్లో నీతి కూడా అలాగే తయారయ్యింది. అన్ని సూనృతాలే అయినప్పుడు ఇక రాజకీయాల్లో అనృతం లేదు. అందుకే అందరూ చెప్పేది నిజమే అన్పిస్తుంది. అవినీతి ఊబిలో నేటి రాజకీయం పీకల పైదాకా కూరుకుపోయింది. నిండా మునిగిపోవడానికి ఇంకా కొద్ది సమయమే మిగిలివుంది. అప్పుడప్పుడూ ఆ ఊబిలోనించే తల బయటపెట్టి రాజకీయ పార్టీలు శ్వాస పీల్చుకుంటున్నాయి. "అవినీతికి ఎన్నికల ఖర్చు, ఎన్నికల అక్రమాలే పునాది" అన్న సుప్రీంకోర్టు ఇటీవల చేసిన వ్యాఖ్యలే నిదర్శనం. రాజకీయాల అంతిమలక్ష్యం ప్రజాసేవ, సుపరిపాలనే అయినా ఆ లక్ష్యాల అమలు చేస్తామంటూ రాజకీయ పార్టీలు వక్రమార్గం పడుతున్నాయి. **"లక్ష్యాలు ఎంత ఉన్నతమైనా వాటిని చేరుకునే మార్గాలు అంతకంటే ఉన్నతంగా ఉండాలని లేకపోతే ఆ లక్ష్యాల కనుచూపుమేరలోకి కూడా పోలేమన్న పూజ్యబాపూజీ"** మాటలు అక్షరసత్యాలు.

ప్రజలు మాత్రం ప్రతి ఎన్నికల్లో అందరూ చెప్పేది విని విని అందులో ఏ మాత్రం కొత్తదనం లేకపోగా చెప్పిందే చెప్పడంతో ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. వాళ్ళు చెప్పే మాటల్లో తమ బ్రతుకుల గురించి జీవితాల గురించి ఏమీ లేకపోయినా వాళ్ళు చెప్పేదే రాజకీయం అని నమ్మి ఎవరో ఒకరికి ఓటు వేస్తున్నారు. ఇందులో మరికొన్ని శసబిశలు. వాడికేస్తే వీడు ఓడిపోతాడు కదా! వీడికేస్తే వాడు గెలుస్తాడు కదా అన్న ఈక్వేషన్స్.

రాష్ట్రమంతా ఎన్నికల జ్వరం మొదలైంది. క్రికెట్ మ్యాచుల్లో బెట్టింగులు, మ్యాచ్ ఫిక్సింగ్‌లూ ఇక్కడా మొదలైయ్యాయి. క్రికెట్ కూడా జూదమైన ఈ రోజుల్లో రాజకీయాలు అంతకంటే బాగా 'కిక్కిచ్చే' వ్యసనంగా మారిపోయాయి. మూడు తోడేళ్ళ మధ్య పోరాటంలో ఏ తోడేలు గెలుస్తుందా అని వాటి చుట్టూ చేరి కేరింతలు, చప్పట్లతో వాటిని ఉత్సాహపరిచే మేక పిల్లల్లా ప్రజలు ప్రవర్తిస్తున్నారు. కేవలం కేరింతలు కొట్టడమే కాదు ఆ తోడేళ్ళలో ఏ తోడేలు గెలుస్తుందనే విషయంలో పందాలు కాస్తున్నారు. ఏ తోడేలు గెలిచినా తమను ఎవరు తినాలనే విషయంపైనే ఈ పోరాటం అన్న సంగతి ఆ అమాయక మేకపిల్లలకు తెలియనట్లే ప్రజలు కూడా మన కులం, మన మతం, మన ప్రాంతం, మన మనిషి ఇలా విభజన రేఖలు గీసుకుని తమను తినే అధికారం ఎవరికి ఇవ్వాలో, ప్రజాధనం ఎవరు భోంచెయ్యాలో తమ ఓటు ద్వారా నిర్ణయిస్తున్నారు.

'శతృవు శతృవు మిత్రుడు అన్నట్లు' ఈ ఉప ఎన్నికల్లో పార్టీల మధ్య మితృత్వాలు, శతృత్వాల విభజన రేఖ చెరిగిపోయింది. పార్టీలు సిద్ధాంతాలపై ఆధారపడకుండా కేవలం గెలుపు ఓటములకు ముడివడి సాగుతున్నాయి. ఇప్పటివరకు రాష్ట్రాన్ని రెండు పార్టీలే పాలించి అధికారాన్ని పంచుకుంటే జగన్‌పేరున మరో పార్టీ ముందుకొచ్చింది. దీంతో వీడేవడయ్యా బాబూ అంటూ ఈ రెండు పార్టీలు తలలు పట్టుకుంటున్నాయి. అధికార ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ప్రజల ముందు తమ సిద్ధాంతాలు, పార్టీ ఎజెండాలు ప్రజలకు చెప్పి ఓట్లు అడిగేబదులు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నాయి. ఈ పార్టీలకి, మరో శతృవు జగన్ రూపంలో రావడం అరుదైన సంగతి. అధికార ప్రతిపక్ష పార్టీలకు ఇప్పుడు జగన్ ఉమ్మడి శతృవు. నాది ఒక కన్ను పోయినాసరే కాని ఎదుటివాడి రెండూ కళ్ళు పోవాలన్న భావన ఈ పార్టీలకు ఉంది. ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీల ఏజండా ఏమిటంటే ఏమైనా గాని జగన్ పార్టీ అభ్యర్థులు ఓడిపోవాలి. ఇక జగన్ ఏజెండా సరే సరి. కాంగ్రెస్, టీడీపీలను మట్టి కరిపించాలి. ఈ మూడు పార్టీలు ప్రజలను, ప్రజా సమస్యలను మరచి మూడు స్తంభాల ఆట ఆడుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో ప్రజా సమస్యలకంటే వ్యక్తిగతమైన అంశాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రజలకు ఇదే అదును. దొందూ దొందే కాదు ఇప్పుడు మూడూ మూడే అనే సామెత మన రాష్ట్ర రాజకీయాల్లో వచ్చింది. ప్రజలు ఈ తేడాను గమనించాలి. మూడు పార్టీలు ఒకేతాను గుడ్డలని రంగులు, జెండాలు వేరైనా వాటి ఎజెండా ఒకటేనని అర్థం చేసుకోవాలి. తమకు ఈ పార్టీలు ఎన్నికల్లో తాత్కాలికంగా ప్రలోభపెట్టే మద్యం, డబ్బు పంపిణీకి లొంగిపోరాదు. **ఈ మూడు పార్టీలకి ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు మొగ్గుచూపాలి. అప్పటిదాకా ప్రతి ఎన్నికల్లో పార్టీలు, నాయకులు గెలుస్తుంటారు. ప్రజలు మాత్రం ఓడిపోతుంటారు.**

## ఎన్నికల్లో ప్రజలే గెలవాలి

# నడుస్తున్న భారతం

ఎన్. రామకృష్ణరాజు

వీధి రౌడీలుగా బ్రతుకుతూ విలాస జీవితం గడుపుతూ
గుండాయిజమే వృత్తిగా బ్రతుకుతున్నారు కొందరు
ఎన్నికలందు వీరి సహకారం లేనిదే నాయకులకు లేదు జయం
ఎన్నికల బరిలోని నాయకులకు వీరే మహాబలం

బంట్రోతు పనికైనా కావాలి అర్హత
గుమస్తాగిరికైనా వుండాలి చదువులో అర్హత
అయితే రాజకీయ పదవికి లేదు ఏ అర్హత
అన్ని పదవులకు అనర్హతే రాజకీయ పదవికి అర్హత

రాజకీయం మారింది లాభసాటి వృత్తిగా
కొన్ని కుటుంబాలకు అయింది యిదే కులవృత్తిగా
రాజకీయమే కులవృత్తిగా స్వీకరించిన కుటుంబాలు
సంపాదిస్తున్నారు రాజకీయ వ్యాపారంలో కోటానుకోట్లు

ఏ రాజకీయ పార్టీ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం
అధికారంలో వుండినంత కాలం అందినంత దోచుకోవడం
యిది రాజకీయ పార్టీల పనితీరుపై సామాన్యుడి నగ్నసత్య వ్యాఖ్యానం,
ఏ రాజకీయ పార్టీకి వున్నది అది అసత్యవాఖ్యానమని చెప్పే సాహసం

## జాషువా - సంప్రదాయ కవిత్వమార్గంలో

# ఆధునిక భావజాలం

- ఆర్వీయార్



గుర్రం జాషువా

జాషువా 1895లో వినుకొండలో జన్మించారు. యే పని చెయ్యాలన్నా కులం అడ్డుగోడ అయింది. బడి చదువుకు అడ్డం. ఓ పుస్తకం చదువుకోవడానికి లేదు, ఓ నాటకం చూడ్డానికి లేదు. యెన్నో అవమానాలు భరించారు. అనుభవాలే పాఠాలయ్యాయి. సమాజమే స్కూలు అయింది. మాల – మాదిగలన్న చిన్నచూపు. తమ కులంలోనే మళ్లీ భేదాలు. చిలకమర్తి వారు యెప్పుడో శతాబ్ది ఆరంభంలోనే హరిజనులకు రామమోహనరాయ్ పాఠశాల పెట్టారు. ఆయన ప్రభావం, కందుకూరి ప్రభావం జాషువా మీద పడ్డాయి. తిరుపతి వేంకటకవుల ప్రోత్సాహం వుంది. ఉభయ భాషా ప్రవీణులై తెలుగు పండితునిగా పని చేశారు. ఆకాశవాణిలో పనిచేశారు. అనేక సత్కారాలు అందుకున్నారు. "నా కథ" అన్న స్వీయ చరిత్ర పద్యకావ్యంగా రాశారు. అనేక పద్యకావ్యాలు, ఖండకావ్యాలు రాశారు. గబ్బిలం, ఫిరదౌసి, ముంతాజ్‌మహల్, క్రీస్తు చరిత్ర కావ్యాలు ప్రసిద్ధం. "అనాథ"లో ఒక బిచ్చుకత్తె దీనగాథని చిత్రించారు. నిత్యజీవితంలోని పదబంధాలను పట్టుగా వాడి ఉత్తమకవి అనిపించుకున్నారు. అంటరానితనం అణగదొక్కడం వల్ల యెంతమంది ప్రతిభావంతులు అడుగంటిపోయారో దయార్ద్ర స్ఫోరకంగా వర్ణించారు.

***ఎంత కోయిలపాట వ్యర్థమయ్యెనోకదా!***
***చిక్కుచీకటి వనసీమలందు***
***ఎన్ని కస్తురి జింక లీడేరెనోకదా***
***మురికి తిన్నెలమీద పరమళించి***
***ఎంత గంధ వహిన మెంత తంగెటి జున్ను***
***యెంత రత్నకాంతి, యెంత శాంతి***
***ప్రకృతి గర్భమందు భగ్నమైపోయెనొ***
***పుట్టరానిచోట పుట్టకతన !***

అన్నారు. యీ పద్యంలోని అన్ని పాదాలనీ యిక్కడ కోట్ చెయ్యలేదు. ముఖ్యమైన వాటిని భావం గ్రహించడానికే గుర్తు చేసుకున్నాం.

యిక గబ్బిలంలో తన కథ ఈశ్వరునికి నివేదించమన్న విన్నపం వుంది. తనకంటే గబ్బిలమే మెరుగు. గబ్బిలానికి ఆలయ ప్రవేశం వుంది. తనకి లేదు. దేవుడే యీ నిబంధన పెట్టాడో, యెవరు పెట్టారో! అంచేత "పూజారి లేనివేళ విన్నవింపుము నాదు చరిత్ర" అని వేడుకున్నాడు. **గబ్బిలానికేం–**

***"ఎన్ని దేశాలు తిరిగిననేమి నీకు***
***నీవు నావలె పుట్టుబానిసవు కావు"***

అని గుండె కరిగేటట్టు తన స్థితిని తెలియచేస్తారు. హిందూ మతంలో హెచ్చుతగ్గులకు కర్మసిద్ధాంతం వాటంగా దొరికింది.

***కర్మసిద్ధాంతమున నోరు కట్టివేసి***
***స్వార్థలోలురు నా భుక్తి ననుభవింత్రు***
***కర్మమననేమొ దానికీ కక్షయేమొ***
***యీశ్వరునిచేత ఋజువు చేయింపవమ్మ !***

అని వేడుకున్నారు. **"వడగాడ్పు నా జీవితమైతే వెన్నెల నా కవిత్వం"** అని వర్ణించుకున్నారు. **"నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు తిరుగులేదు. విశ్వనరుడ నేను"** అని అన్ని హద్దులూ చెరిపి చాటారు.

**"పస్నిన సత్ప్రబంధమున బాగును నోగును జూడకూరికే మన్నన మాని మా కులము మాట దలంతురు చేమకూర వెంకన్నకు లోపమేమి కులమా కవనానకు"** అని బుచ్చి వెంకు అనే కవి

వాసిరెడ్డి వేంకటాద్రి నాయనికి మొరపెట్టుకున్నాడట. రామరాజభూషణుడంతటివానికే యిలాంటి దురవస్థ తప్పలేదట. కుమార అస్త్రవిద్యాప్రదర్శన సమయంలో కర్ణుడు యెంతో బాధపడాల్సి వచ్చింది. హిందూ సమాజంలో కులవ్యవస్థకి నాలుగువేల యేళ్ల చరిత్ర వుంది. ఎన్ని కొత్త మతాలు పుట్టినా, వర్ణవ్యవస్థని రూపుమాపాలని ఎందరో మహనీయులు నడుం కట్టినా, కొత్త మతాలు స్థాపించినా వాటిలో కులవ్యవస్థ పుట్టుకొచ్చిందే గాని పోలేదు. వైష్ణవం దగ్గర్నుంచి క్రైస్తవమతం దాకా యీ అంటువ్యాధి సోకకుండా వుండలేదు. అరుంధతీరాయ్ నవల "ది గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్" కేరళలో క్రైస్తవుల పరిస్థితిని వర్ణిస్తుంది. దళిత క్రైస్తవులు వేరు, అగ్రకుల క్రైస్తవులు వేరు. హిందూ సమాజంలో కులవ్యవస్థ అంతర్భాగం. కులవ్యవస్థలో హెచ్చుతగ్గులు అంతరాలు అంతర్భాగం. అవి ప్రతిభా విశేషాల వల్ల, శక్తి సామర్థ్యాల వల్ల సంపాదించుకున్న ఆధిక్యం, హెచ్చుస్థాయి కావు. కేవలం జన్మ వల్ల సంక్రమించేవి మాత్రమే. ఆ హోదా అలా పుట్టుకతోనే దక్కుతుంది. యిక యీ వ్యవస్థలో మరో ముఖ్య అంశం వుంది అది అంటు అన్న భావం. ఒక్కొక్కళ్లని తాకితే అంటు, మరి కొందర్ని చూస్తేనే అంటు. యిది శారీరక పరిశుభ్రతల్ని అపరిశుభ్రతల్ని బట్టి వచ్చేది కాదు. కేవలం భావనాత్మకమైంది. మైలపడిపోతామన్న భావం మనుషుల మధ్య వుండే అన్ని సంబంధాలనీ నడిపిస్తుంది. యిది బాగా దిగువస్థానంలో వున్నవాళ్ల పట్ల మరీ క్రూరంగా వుంది. అంటరానివాళ్లని ఆజన్మాంతం వాళ్లని దూరంగా వుంచడం హిందూ జీవితంలో భాగం అయింది. వాళ్లని అస్పృశ్యులని ముద్రవేసి వూరికి దూరంగా వుంచారు. సమాజంలో యే హక్కులూ లేవు, యే గౌరవమూ లేదు. ఆత్మగౌరవం అనే మాటకి అర్థమే తెలీదు వాళ్లకి.

***కులాన్ని బట్టి పరిగణన లభించే సంఘంలో పుట్టాడు జాషువా.***

***సభలోని కెట్టు జొరబడే***
***నభాగ్యుడీ నిమ్నజుండటంచుం దమలో***
***గుభగుభలాడి తటాలున***
***సభికులు పదిమంది లేచి***

***వెళ్ళిపోయే రోజులు. అంతే కాదు – "ఇతర కులాల వాళ్లు కవిత్వం రాయకూడదన్న" ఆంక్షలూ పెట్టారు.***

***"నా కవితా వధూటి వదనంబు నెగాదిగమాచి***
***రూపురేఖా కమనీయ వైఖరులగాంచి, భళాభళి అన్నవాడె***
***మీదేకులమన్న ప్రశ్న వెలయించి, చివాలునలేచి***
***పోవుచో – బాకున క్రుమ్మినట్లగును..."***

అని క్షోభించారు. అసలు కవిత్వరచనకీ కులానికీ సంబంధం యేమిటని నిలదీసి అడిగేవాళ్లు లేరు. **"పద్యమందున్న జీవకవిత్వమే చదువరుల కువుపాదేయం గాని మిగిలిన విషయాలు అనవసరం"** అని చెళ్లపిళ్లవారు అన్నారు. అంతటి దొడ్డబుద్ధి సంప్రదాయానుసారులకు లేకపోయింది. **"భిక్షుణా కక్షి నిక్షిప్త కిమిక్షుర్నీరసో భవేత్"** చెరుకుగడ భిక్షుకుని కక్షిలోవున్నా తియ్యదనం పోతుందా? **"ఇవ్వసుధాస్థలిన్ పొడమరె రస లుబ్ధులు"** అనే ఆశతో జాషువా **"ఘంటము పూనెదన్ రవ్వలు రాల్చెదన్ గరగరల్ సవరించెద నాంధ్ర వాణికిన్"** అని ఢంకా బజాయించి చాటారు.

ఆయన భావకవిత్వ రోదనల్ని అసహ్యించుకున్నాడు. **"పూదోటల మదబంభర నాదముల విలాసవతుల నడబెడగుల నాహ్లాదించు కవులకీ నిరుపేదల ఆక్రందనములు వీనులబడునా?"** అని ప్రశ్నించాడు. **"ప్రతిమల పెండ్లి చేయుటకు వందలు వేలు వ్యయింత్రుగాని దు్ఃఖితమతులైన పేదల పకీరుల శూన్యములైన పాత్రలన్ మెతుకు విదల్చరీ భరతమేదిని"** అంటూ ఆక్రోశించారు.

జాషువా సంప్రదాయ రీతిలో పద్యాలు రాశారు. ఆ గణబద్ధ పడికట్లనీ, యతిప్రాస నియమాలనీ పాటించారు. **"ప్రసిద్ధాంధ్ర కవులు మ్రోయించిన కవితా వీణలు నా పసితనంలో నన్నాకర్షించాయి. నేనూ ఒక వీణ మ్రోయించాలని అనుకున్నాను. ప్రయత్నం మీద నాకు లభించింది వీణ కాదు, సితార్! అది నా కవిత – వినిపించినది ప్రజలకు కాని, ప్రభువులకు కాదు"** అని వివరించారు.

పద్ధతి పాతది, కాని భావాలు కొత్తవి. ఆయన భావాల విషయంలో యింత నూతన దారులు తొక్కినా భాష విషయంలో నవీన రీతికి రాలేదు. ఆయన ఆనాటి తన నేపథ్యంలో పద్యరీతిని ఆశ్రయించడం తప్పదేమో ననిపిస్తుంది. పద్య రచనని పట్టుకున్నా పాండిత్య ప్రాగల్భ్యాలు ప్రదర్శించలేదు. గణబద్ధ నియమాలు ఆశించే మేరకు తప్ప నిత్యవ్యవహారంలో వుండే పదాలే. అర్థం కాకపోవడమన్నది వుండదు.

అవును – యెందుకర్థం కాదు? ఆ భావాలు యిప్పటివి, ఆ మాటలు యిప్పటివి, కరుణరసం ప్రవహించే శైలి. ఆయన అట్టడుగు వర్గాల ప్రజల దీనస్థితిని చిత్రించాడు. వర్ణభేదాలు సమసిపోవాలన్నాడు. **"వర్ణభేదపుం బీడనడంచెదన్, కటిక చీకటివాపెద, వెట్టి నమ్మకాలూడని బాధ, హస్తమున నూనెద శాత కళాకుఠారమున్"** అని చాటాడు. ఆయన జీవితంలో గాంధేయవాది. సామ్యవాదం కోరాడు. కాని వర్గసంఘర్షణని సమర్థించలేదు. సమతావాది అయ్యాడు. ◆

# సంక్షోభంలో వ్యవసాయరంగం

## ఖమ్మం రైతు సదస్సులో మాజీ మంత్రి వడ్డే శోభనా ద్రీశ్వరరావు




**ఖమ్మం :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల వ్యవసాయ రంగం నేడు సంక్షోభంలో పడిందని వ్యవసాయశాఖ మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు విమర్శించారు. ఖమ్మం స్వర్ణభారతి కళ్యాణ మండపంలో లాభసాటి వ్యవసాయం ఎలా అనే అంశంపై స్వతంత్ర రైతుసంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి రైతు సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు ఈ విధానాల కారణంగానే రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. రైతులు పెట్టే పెట్టుబడికి వచ్చే ఆదాయానికి పొంతన లేకుండా ఉందన్నారు. సీపీఐ అనుబంధ రాష్ట్ర రైతుసంఘం అధ్యక్షుడు కె.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో తీవ్రమైన కరవు పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 870 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకొంటున్నారు. రైతాంగ సమస్యలపై ఈ నెల 13న హైద్రాబాద్‌లో అఖిలపక్ష రైతుసంఘాల అధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. రైతు సంఘాల సమాఖ్యరాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్నేని నాగేంద్రనాథ్ మాట్లాడుతూ రైతులు నేడు లాభసాటి వ్యవసాయం మర్చిపోయారు. కనీసం నష్టం రాకుండా ఉండే విధంగా చేస్తున్నారన్నారు. అన్నిపంటల ధరలు గతేడాదితో పోలిస్తే సగానికి సగం తగ్గిపోయాయన్నారు. భారతీయ కిసాన్‌సంఘ్ రాష్ట్ర కార్యదర్శి కె.కుమారస్వామి మాట్లాడుతూ ప్రభుత్వాల మనస్తత్వాలు మారనంతవరకు రైతు బతుకు మారదన్నారు. స్వతంత్ర సంఘాల రాష్ట్ర కన్వీనర్ పి.భాస్కర్‌రావు మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచేవరకూ ఆందోళన చేయవలసిన అవసరం ఉందన్నారు. రైతుల్లో ఐక్యత లేకపోవటం వల్లనే దారుణంగా దోపిడీకి గురవుతున్నారన్నారు. సదస్సుకు స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య జిల్లా కన్వీనర్ డాక్టర్ సామినేని రాఘవులు కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ప్రముఖ విద్యావేత్త ఎన్వీ నారాయణ అధ్యక్షత వహించారు. సదస్సులో జిల్లా పరిషత్ మాజీఛైర్మన్ చేకూరి కాశయ్య, మాజీ ఎమ్మెల్సీ సామినేని హిమవంతరావు, తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లమల వెంకటేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు టీవీ చౌదరి, తెలుగు రైతు నాయకుడు గుత్తా వెంకటేశ్వరరావు, తెలంగాణా చెరకు రైతు సంఘం అధ్యక్షుడు అప్పిరెడ్డి, ప్రకృతి వ్యవసాయదారులు పొన్నుస్వామి, నాగరత్నం, నాయుడు తదితరులు ప్రసంగించారు.

మహారాష్ట్ర షేత్‌కారి సంఘటన రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ గుణవంతరావు పాటిల్ ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య తమ మద్ధతు ప్రకటించి రైతులకు లాభసాటి ధర లభించేవరకు, ప్రభుత్వ విధానాలు మార్చుకునే వరకు సంఘటితంగా పనిచేయవలసిన అవసరాన్ని చెప్పారు.

### ప్రకృతి రైతులకు ఘన సన్మానం

సదస్సులో ప్రకృతి రైతులు సామినేని హిమవంతరావు, పొన్నుస్వామి, నాగరత్నం నాయుడు, రామకృష్ణరాజును ఘనంగా సన్మానించారు. ఒక్కొక్కరికి రూ॥10వేల నగదుతో పాటు ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వీరికి రైతురత్న బిరుదును ప్రధానం చేశారు. లాభసాటి వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం గురించి వీరు చేసిన ప్రసంగం రైతులను ఆకట్టుకుంది. ◆

# ఆ మూడు పార్టీలు ప్రజల సొమ్మును దోచుకుంటున్నాయి



## రాయదుర్గం

కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు లోకేష్, రియాజ్, అబ్దుల్లా, నాగరాజు, తిప్పేస్వామి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**గుమ్మఘట్ట (రాయదుర్గం) :** రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు మూడూ ఏకమై ప్రజల సొమ్మును దోచుకుంటున్నాయని లోక్‌సత్తా పార్టీ అభ్యర్థి బాబు విమర్శించారు. అలాంటి పార్టీల నాయకులకు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మండల పరిధిలోని గోనబావి గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయదుర్గం నియోజకవర్గంలో అపారమైన ఖనిజసంపద దోచుకునేందుకు ఆ మూడు పార్టీల నాయకులు ఏకమై పోటీలు పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మూడేళ్ళపాటు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసమస్యలను పట్టించుకోకుండా స్వప్రయోజనాల కోసం పాకులాడు తుండగా... టీడీపీ, వైఎస్ఆర్‌సీపీలు సీఎం పదవి కోసం పోటీ పడుతున్నాయన్నారు. అలాంటి పార్టీలకు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాయదుర్గం నియోజకవర్గంలో ఉపఎన్నికలు జరుగుతున్న తరుణంలో సీఎం ప్రత్యేక నిధి నుంచి కోట్లాదిరూపాయలు విడుదల చేసి, యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి, ఓట్లు దండుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అలాగే వైఎస్ఆర్ పార్టీ అవినీతి సొమ్ముతో ప్రజలను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నిస్తోందని దీనిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. అవినీతి రహిత సమాజనిర్మాణం కోసం లోక్‌సత్తా పార్టీ పాటుపడుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి నిర్మూలన కోసం కృషి చేస్తోందని, ఉపఎన్నికల్లో ప్రజలను మార్పు కోరేందుకు ఇక్కడ అభ్యర్థిని నిలబెట్టిందన్నారు.



## రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారు

**రాయదుర్గం :** రాష్ట్రంలో కాంగ్రెస్ తెదేపా, వైకాపా ఓటు బ్యాంకు రాజకీయాలను ప్రోత్సహిస్తూ... అవినీతి మద్యాన్ని పెంచి పోషిస్తూ దోచుకుంటున్నాయని రాయదుర్గం లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు బాబు విమర్శించారు. రేకులకుంట, డి. కొంగాపురం గ్రామాల్లో ఆయన పార్టీ నాయకులతో కలసి అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య తదితర రంగాలను వ్యాపారంగా మార్చేశారన్నారు. ప్రజలు కరవుకాటకాలతో ఆల్లాడుతుంటే, రాజకీయ పార్టీ నాయకులు పట్టించుకోకుండా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారన్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం పంచకుండా న్యాయబద్ధంగా గెలిచి నిజాయతీ నిరూపించుకోవాలన్నారు. మూడేళ్లుగా రాయదుర్గం నియోజకవర్గంలో లోక్‌సత్తా పార్టీ అనేక పోరాటాలు సాగించి ప్రజల మద్దతు పొందుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో అబ్దుల్లా, రియాజ్, లోకేష్, తిప్పేస్వామి, నాగరాజు, రాజు, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాపై మద్యం ముసుగు తొలగించండి

విజయనగరం




**బాబామెట్ట :** జిల్లాకు పట్టిన మద్యం ముసుగు తొలగించి, రెండు ప్రధాన పార్టీల్లో మద్యం సిండికేట్ల బినామీలను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో ప్రజాధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ జిల్లాలోని తెదేపా, కాంగ్రెస్‌పార్టీలు కుమ్మక్కై ఎవరికి వారు ధర్నాలు చేపడతామని చెబుతూ ప్రజలను మోసం చేయడమే వారి లక్ష్యంగా చేసుకుని, ఇలాంటి మోసపూరితమైన ప్రకటనలతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు.

అనంతరం కొద్ది సేపటికే ప్రజాధర్నా కార్యక్రమం చేపడుతున్న సమయంలో పోలీసుల రంగప్రవేశం జరిగింది. సి.ఐ.లక్ష్మణరావు ధర్నాలో పాల్గొన్న బాబ్జీతో ఎటువంటి సమాచారం లేకుండా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టకూడదని చెప్పారు. డీఎస్పీకి ఈనెల 14వ తేదీన లెటరు ద్వారా సమాచారం అందించామని, ఇది ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా ప్రజోపయోగానికి చేపట్టిన ధర్నా కాబట్టి ఇలా మీరు రావడం సబబు కాదని సి.ఐ.లక్ష్మణరావుతో చెప్పారు. సమాచారం మా వరకు రాలేదని ఇలాంటి కార్యక్రమాలపై ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయని వీటిని ఉల్లంఘించి చేపట్టడంతో మిమ్మల్ని అరెస్టు చేస్తున్నామని చెప్పారు. న్యాయం జరిగేంత వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని పార్టీ నాయకులు మొండికేసారు. ఎంతకీ వినకపోవడంతో వారిని లాక్కుని వ్యాను ఎక్కించారు. ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద పెద్ద బోర్డులు పెట్టుకుని చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతున్న ఐదు పార్టీలను ప్రశ్నించని పోలీసులు మా పై ఇలా చేయడం అన్యాయమని నినాదాలు చేశారు. అరెస్టయిన వారిలో జిల్లా మహిళాసత్తా ప్రతినిధులు పి.అనంతలక్ష్మి, బి.ఉదయగౌరి, జిల్లా యువసత్తా ప్రతినిధులు పి.వెంకటరమణ, దయానంద్ తదితరులు ఉన్నారు.

పెద్దఎత్తున పోలీసులు రంగప్రవేశం చేసి పలువురు నాయకుల్ని కార్యకర్తల్ని అదుపులో తీసుకుని వ్యానులో పోలీసు స్టేషనుకు తీసుకెళ్లారు. వారు వేసిన టెంట్‌లను నేలమట్టం చేశారు. అనంతరం కొద్దిసేపటికి సొంత పూచీకత్తుపై విడుదల చేయడంతో అంతా ప్రశాంతం అయింది.




మద్యం సిండికేట్ల వివరాల్ని బయటపెట్టాలని కోరుతూ విజయనగరంలో

## లోక్‌సత్తా పార్టీ ధర్నా దృశ్యాలు



RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12



మద్యం సిండికేట్ల వివరాల్ని బయటపెట్టాలని కోరుతూ విజయనగరంలో

# లోక్‌సత్తా పార్టీ ధర్నా

To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad